# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

09.04.2026 గురువారం Thursday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 257 | పేజీలు : 11 Pages : 11 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana









# ప్రాణాలతో ఇంటికి తిరిగి వస్తానని అనుకోలేదు!

**47 ఏళ్ల అనంతరం సొంతూరు కోరుట్లకు మావోయిస్టు అగ్రనేత 'దేవ్ జీ' రాక**

నాలుగు దశాబ్దాలకు పైగా అజ్ఞాత పోరాటం, త్యాగం, జ్ఞాపకాల భారంతో సుదీర్ఘ కాలం గడిపిన మావోయిస్టు కేంద్ర కమిటీ మాజీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ (68) బుధవారం తన సొంత గడ్డపై అడుగుపెట్టారు. 1983లో విప్లవ బాట పట్టి, అంచెలంచెలుగా ఎదిగి దేశంలోనే మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నేతల్లో ఒకరిగా నిలిచిన ఆయన, దాదాపు 47 ఏళ్ల తర్వాత కోరుట్లకు చేరుకోవడం స్థానికంగా పెను సంచలనం సృష్టించింది.

1983లో ఉద్యమంలో చేరి కేంద్ర కమిటీ కార్యదర్శి స్థాయికి ఎదిగిన తిప్పిరి తిరుపతి

13

లొంగిపోయిన అనంతరం మొదటిసారి స్వగృహ ప్రవేశం.. భావోద్వేగ క్షణాలు

బంధుమిత్రుల మధ్య జ్ఞాపకాల వెల్లువ.. ప్రజాజీవితంలో కొనసాగుతానన్న 'దేవ్ జీ'



# పైలట్ శిక్షణలో ఘోరం


యువతిపై ట్రైనీ ఇన్‌స్ట్రక్టర్ లైంగిక దాడి!

ఫోటోలు, వీడియోలతో బ్లాక్‌మెయిలింగ్

కేరళకు చెందిన నిందితుడు నసీముద్దీన్ అరెస్ట్

సహకరించిన మరో ఇన్‌స్ట్రక్టర్ సల్మాన్‌పై కూడా కేసు

వివరాలు 3వ పేజీలో



ఖర్చు కాదు..

# భాగస్వామ్యం

## ప్రాధాన్య రంగాలను మీరే ఎంచుకోండి

**అవసరమైన సహకారం అందిస్తాం**

**సీఎస్ఆర్ నిధులపై కంపెనీల ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 8 :** సమాజాభివృద్ధికి చేసేది ఖర్చుగా కాకుండా భాగస్వామ్యంగా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. సీఎస్ఆర్ నిధులకు సంబంధించి వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కంపెనీలు సీఎస్ఆర్‌కు చేస్తున్న వ్యయం వందకు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాలన్నారు. తమ ప్రభుత్వం విద్యా, వైద్యం, జల వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తుందని తెలియజేశారు. కంపెనీలు వీటితో పాటు తమకు ఇష్టమైన ఏ రంగాన్నైనా ఎంచుకొని సీఎస్ఆర్ నిధులు వినియోగించాలని సూచించారు.

మిగతా 3 లో



వివరాలు 2వ పేజీలో

# చేనేతలో టెండర్ల విధానం రద్దు చేయండి


- సీఎం రేవంత్‌తో ఘనా హైకమిషనర్ భేటీ
- సీఎంతో భేటీ అయిన టాటా ఏరోస్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ టిమ్ రైఫిల్

సీఎం రేవంత్ రెడ్డిని రిపబ్లిక్ ఆఫ్ ఘనా హైకమిషనర్ క్వాసి ఒబిరి-డాన్సో మర్యాదపూర్వకంగా కలిశారు. హైకమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా హైదరాబాద్ కు వచ్చిన ఆయన ముఖ్యమంత్రి నివాసంలో భేటీ అయ్యారు. ఘనా, తెలంగాణ మధ్య మైత్రీ సంబంధాలు కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు.

# ఇరాన్‌తో యుద్ధానికి పక్షం విరామం

15 రోజుల సీజ్‌ఫైర్ ప్రకటించిన ట్రంప్

హార్మూజ్‌పై సుంకాలు విధింపును సమర్థించుకున్న ఇరాన్ 4



రోజులుగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. అమెరికా-ఇరాన్ మధ్య రెండు వారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఇరాన్‌పై దాడులను రెండు వారాల పాటు ఆపేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం తాత్కాలికంగా నిలిచిపోయింది.

ఈ శాంతి కేవలం 'తాత్కాలికమే' అని, యుద్ధం ముగిసిందని ఎవరూ భ్రమపడొద్దని ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ఇచ్చిన హెచ్చరిక ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.



# ఇది యుద్ధానికి ముగింపు కాదు

మొజ్తాబా ఖమేనీ సంచలనం

10న ఇస్లామాబాద్‌లో 'మహా' చర్చలు

.. వివరాలు 4లో

# కాళేశ్వరం మోటర్లపై కుట్ర?

- మంత్రి ఉత్తమ్‌కు హరీశ్ రావు లేఖ
- అశాస్త్రీయ నిర్వహణతో పంపులు దెబ్బతినే ప్రమాదం
- రాజకీయాల కోసం ప్రాజెక్టులను పాడు చేయొద్దని హెచ్చరిక

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** కాళేశ్వరానికి సంబంధించిన భారీ నీటిపారుదల మోటర్లను ధ్వంసం చేసే కుట్ర సాగుతోందంటూ మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు. ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ నేత ఆగ్రహం వ్యక్తం చేస్తూ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. భారీ మోటర్లను నిబంధనలకు విరుద్ధంగా పదే పదే ఆన్, ఆఫ్ చేస్తూ అశాస్త్రీయంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇలా చేయడం వల్ల పంపుల పనితీరు దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.



### నిర్లక్ష్యమా.. కుట్రనా?

పదే పదే మోటర్లను ఆపడం వల్ల వైబ్రేషన్స్ వచ్చి పంపులు, ఇంప్లర్స్ వంటివి పాడయ్యే ప్రమాదం ఉందని హరీశ్ రావు హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెపం నెట్టేందుకే ఉద్దేశపూర్వకంగా మోటర్లను పాడు చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ పాలనాపరమైన నిర్లక్ష్యమా లేక కావాలనే చేస్తున్న కుట్రనా అని నిలదీశారు. చందలాపూర్ సహా ప్యాకేజీ 6, 8, 10, 11, 12లలో మోటర్ల ఆపరేషన్ తీరు తీవ్ర అభ్యంతరకరమని తెలిపారు. వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టులను ఇలా నిర్లక్ష్యంగా వాడటం శోచనీయమని మండిపడ్డారు.

### ప్రాజెక్టులతో చెలగాటం వద్దు

తక్షణమే మోటర్లను పదే పదే ఆన్, ఆఫ్ చేసే అశాస్త్రీయ విధానాన్ని ప్రభుత్వం మానుకోవాలని ఆయన సూచించారు. ఇంజనీరింగ్ నిబంధనల ప్రకారం, డిజైన్‌కు అనుగుణంగా నిరంతరాయంగా పంపులు నడిపించాలని తెలిపారు. రాజకీయాల కోసం తెలంగాణ రైతుల జీవనాడి అయిన ప్రాజెక్టులతో చెలగాటం ఆడవద్దని హెచ్చరించారు. భారీ మోటర్లు నిరంతరాయంగా నడిచేలా డిజైన్ చేసినవని, పదే పదే ఆపితే తీవ్ర నష్టం తప్పదని హరీశ్ రావు స్పష్టం చేశారు.


# ప్రధాని వ్యూహాలు అమోఘం

- నితిన్ నబీన్ నియామకంపై లక్ష్మణ్ ఆసక్తికర వ్యాఖ్యలు
- వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపు మాదేనని ధీమా

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల అనంతరం తెలంగాణపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ ప్రకటించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పటికీ.. రేవంత్ రెడ్డి వైపు గాలి వీచిందని ఆయన పేర్కొన్నారు. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో జరిగిన ఇష్టాగోష్టిలో ఆయన పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ ఆలోచనలు ఎవరికీ అందవని, రెండో వ్యక్తికి కూడా తెలియని విధంగా ఆయన నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్‌ను ఎంపిక చేస్తారని ఎవరూ ఊహించలేదని, ఇది అందరినీ ఆశ్చర్యపరిచిన విషయమని లక్ష్మణ్ వివరించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ తిరిగి నిలబడటం అంత సులభం కాదని ఆయన అభిప్రాయపడ్డారు.

### కవిత ప్రశ్నలు.. హేట్ స్పీచ్ పై నిలదీత

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అడుగుతున్న ప్రశ్నలకు ఎవరూ సమాధానం చెప్పడం లేదని లక్ష్మణ్ గుర్తు చేశారు. అయితే ఆమె ఇప్పుడు ప్రస్తావిస్తున్న అంశాలను బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే మాట్లాడి ఉంటే బాగుండేదన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయాన్ని ఎవరూ ఊహించలేదని, తెలంగాణ ప్రజలు కూడా ఎంతో తెలివైన వారని కొనియాడారు. లోక్ సభ ఎన్నికల్లో ఎనిమిది సీట్లు రాగా.. ప్రజలు ముప్పై ఎనిమిది శాతం ఓట్లు కట్టబెట్టారని గుర్తు చేశారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీదే పైచేయి అవుతుందని జోస్యం చెప్పారు. మహిళా బిల్లు, డీలిమిటేషన్ తర్వాత దేశమంతా ఏకపక్షంగా మారుతుందని పేర్కొన్నారు. తమిళనాడులో విజయ్ పార్టీకి జనం వస్తున్నా.. ఐదారు సీట్ల కంటే ఎక్కువ రావని అన్నారు. హేట్ స్పీచ్ బిల్లు తెస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి.. ముస్లింలను రెచ్చగొట్టే వ్యాఖ్యలపై ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన



నిలదీశారు. ఇది హేట్ స్పీచ్ కాదా అని సీఎంను సూటిగా ప్రశ్నించారు.

# కాంగ్రెస్‌కు తెలంగాణే ఏటీఎం!

### ఢిల్లీకి గులాంగిరీ చేస్తోన్న రేవంత్ ప్రభుత్వం

### ఏప్రిల్ 25న చరిత్రను మారుస్తాం: కవిత



**హైదరాబాద్, ఏప్రిల్ 8:** దేశంలో ఎక్కడ ఎన్నికలు వచ్చినా సరే కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఢిల్లీకి ఘోరమైన గులాంగిరి చేస్తోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫోన్ చేస్తే ఫోన్‌లో మాట్లాడేటప్పుడు కూడా రేవంత్‌రెడ్డి నిలబడే మాట్లాడుతున్నారని.. లేదంటే తన కుర్చీకి ఎక్కడ ఎసరు వస్తుందోనని భయపడుతున్నారని సెటైర్లు గుప్పించారు. బుధవారం తెలంగాణ జాగృతిలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్, ఆయన అనుచరులు చేరారు. కండువా కప్పి జాగృతిలోకి కవిత ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. రాసి పెట్టుకోండి.. తెలంగాణ భవిష్యత్, చరిత్రను మార్చే రోజు ఏప్రిల్ 25 అవుతోందని కవిత ఉద్ఘాటించారు. కొత్త నెత్తురు, కొత్త రాజకీయాలను ఈ గడ్డకు పరిచయం చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికార పక్షం కాంగ్రెస్, ప్రతిపక్షం బీఆర్ఎస్ ప్రజల సమస్యలను ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. ప్రజల సమస్యల గురించి ప్రశ్నించేదెవరు అంటే ప్రతినోట జాగృతియే అనే మాట వస్తోందని చెప్పారు. ప్రజల సమస్యల గురించి కాంగ్రెస్ హైకమాండ్‌ని పైసలు అడిగితే నో రాహుల్ జీ అని రేవంత్‌రెడ్డికి సమాధానం చెబుతున్నారని అన్నారు. కానీ కేరళ ఎన్నికల కోసం ఎంత ఖర్చయినా పెడుతున్నారని విమర్శించారు. అప్పర్ తుంగభద్రకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇస్తే రేవంత్‌రెడ్డి ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని ప్రశ్నించారు. జాతీయ హోదా కారణంగా తుంగభద్రకు నీళ్లు రాక నష్టపోయేది ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాయేనని.. కానీ ఈ విషయంలో రేవంత్‌రెడ్డి ఎందుకు మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదని నిలదీశారు. అటు కాంగ్రెస్‌ను, ఇటు బీజేపీని మెయింటెయిన్ చేస్తూ ప్రజలను మాత్రం మోసం చేస్తున్నారని ఆగ్రహించారు. తెలంగాణ జాగృతి తరఫున వచ్చే పార్టీ.. ప్రజల సమస్యలపై పోరాటం చేస్తుందని భరోసా కల్పించారు. అంతర్జాతీయ స్థాయిలో నిపుణులతో సమావేశమై ప్రజల కోసం అద్భుతమైన అజెండా రూపొందిస్తున్నానని చెప్పుకొచ్చారు. కొత్త తరహా రాజకీయాలు, ప్రజల కోసం మంచి చేసే రాజకీయాలు ఎలా ఉంటాయో చూపిస్తామని కవిత పేర్కొన్నారు.



# తెలంగాణ భవన్ ముట్టడి.. ఉద్రిక్తత!

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** తెలంగాణ భవన్ వద్ద బుధవారం భారీ ఉద్రిక్తత చోటుచేసుకుంది. తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సభ్యులు బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం లోపలికి దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య గందరగోళం, తోపులాట జరగడంతో వాతావరణం వేడెక్కింది. పరిస్థితి అదుపు తప్పకుండా అధికారులు అదనపు బలగాలను అక్కడ మోహరించారు. పోలీసుల తీరుపై జేఏసీ నేతలు మండిపడ్డారు. ఉద్యమకారులను బిఆర్ఎస్ పార్టీ పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం దగ్గర తమ సమస్యల గురించి బిఆర్ఎస్ ఎందుకు గళం విప్పడం లేదని ప్రశ్నించారు. కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టడంతో ఉత్కంఠ నెలకొంది. తమ ఇబ్బందులను పట్టించుకోని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఖచ్చితంగా తమ గోడు వినాలంటూ భవన్ వద్ద నినాదాలు చేశారు.

# జగిత్యాల పాలిటిక్స్‌లో బిగ్ ట్విస్ట్

## నేడు జీవన్ రెడ్డి ఇంటికి కేటీఆర్!



**జగిత్యాల, ఏప్రిల్ 8:** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకోబోతోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. అయితే, ఈ పర్యటన కేవలం పార్టీ కార్యకలాపాలకే పరిమితం కాకుండా, ఒక సంచలన భేటీకి వేదిక కాబోతుండటం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన సీనియర్ నాయకులు, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డితో కేటీఆర్ భేటీ కానుండటం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. గత కొంతకాలంగా కాంగ్రెస్ నాయకత్వంపై అసంతృప్తితో ఉన్న జీవన్ రెడ్డి, రాజీనామా అనంతరం సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా తీవ్ర విమర్శలు చేస్తున్నారు. స్థానికంగా బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడంతోనే ఆయన పార్టీ మారతారనే ఊహాగానాలు మొదలయ్యాయి. నేటి పర్యటనలో భాగంగా కేటీఆర్ నేరుగా జీవన్ రెడ్డిని కలిసి, ఆయనను అధికారికంగా బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఉత్తర తెలంగాణలో బలమైన పట్టున్న జీవన్ రెడ్డి వంటి నేత పార్టీలోకి వస్తే, అది బీఆర్ఎస్‌కు కొండంత అండగా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. కేటీఆర్ రాక సందర్భంగా జగిత్యాల పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. జీవన్ రెడ్డి అనుచరులు కూడా ఈ పర్యటనపై ఎంతో ఆసక్తిగా ఉన్నారు. ఒకవేళ జీవన్ రెడ్డి గూలాబీ తీర్థం పుచ్చుకుంటే, ఆయన ఎప్పుడు జెండా పడతారనే విషయంపై నేడు స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కేటీఆర్ పర్యటనతో జగిత్యాల జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.



# ఏసీబీ పంజా..

### ఒకే రోజు ముగ్గురు కీలక అధికారులు అరెస్ట్!

### రూ. 2 లక్షలు తీసుకుంటూ చిక్కిన శంషాబాద్ సీఐ, ఎస్సై

### రిటైర్డ్ టీచర్ ఫైల్ కోసం రూ. 15 వేలు నొక్కిన ఎంఈఓ

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** ఏసీబీ అధికారులు మరో ఇద్దరు ప్రభుత్వ అధికారులు చిక్కారు. ఉదయం మహబూబాబాద్ మండలం గూడురు గ్రామంలో ఎంఈవో, స్కూల్ అసిస్టెంట్ లంచం తీసుకుంటూ పట్టుబడగా తాజాగా శంషాబాద్ పరిధిరో సర్కిల్ ఇన్స్‌పెక్టర్, సబ్ ఇన్స్‌పెక్టర్ ఏసీబీ వలకు చిక్కారు. శంషాబాద్ పరిధిలోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన కేసులో అరెస్టు చేయకుండా కేసు నుంచి తప్పించడానికి లంచం తీసుకున్న ఇద్దరు పోలీసు అధి కారులను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. రాజీవ్ గాంధీ విమానశ్రయం పోలీసు అవుట్ పోస్టులో సీఐగా పనిచేస్తున్న యూ.కె సిద్దేశ్వర్, ఎస్సై సంపతి కనకయ్య రూ. 2 లక్షలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఓ కేసులో చార్జిషీట్, అరెస్టు చేయకుండా చూడాలని బాధితుడు కోరగా వారు రూ. 5 లక్షలు డిమాండ్ చేశారు. ఇందులో మొదటి విడతగా 2 లక్షలు ఒప్పందం జరిగి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు.

### మహబూబాబాద్ జిల్లాలో హెడ్మాస్టర్

**మహబూబాబాద్:** ఉపాధ్యాయుడు లంచావతారమెత్తాడు. ఏకంగా హెడ్మాస్టర్ లంచం తీసుకోవడంతో చర్చనీయాంశమైంది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. గూడూరు మండలం అయోధ్యపురంలో పాఠశాల ప్రధానోపాధ్యాయున్ని రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఇన్చార్జ్ ఎంఈఓగా వ్యవహరిస్తున్న రవికుమార్ టీచర్ ఫైల్ క్లియర్ చేయడం కోసం డబ్బులు డిమాండ్ చేశారు. బాధితుడు రూ.15000 లంచమిస్తూ ఏసీబీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు హెడ్మాస్టర్ ను పట్టుకున్నారు. రిటైర్డ్ కాబోయే ఉపాధ్యాయుడి నుంచి ముడుపులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు హెడ్మాస్టర్ పట్టుబడడంతో కలకలం రేపింది. విచారణ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

# హరీష్ పర్యటనకు గ్రీన్ సిగ్నల్

### జిల్లా ఎస్పీ ఆదేశాలను తోసిపుచ్చిన హైకోర్టు

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు వనపర్తి పర్యటనకు తెలంగాణ హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హరీశ్ రావుకు వనపర్తి జిల్లాలో పర్యటించేందుకు అనుమతినిస్తూ ఆదేశాలు జారీ చేసింది. హరీశ్ రావు పర్యటనకు అనుమతి లేదన్న జిల్లా ఎస్పీ ఆదేశాలను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. గొల్లపల్లి రిజర్వాయ-ర్‌ను వ్యతిరేకిస్తూ స్థానిక రైతులు ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే, వారికి మద్దతుగా మాజీ మంత్రి అక్కడి పర్యటించి భారీ బహిరంగ సభ పెట్టాలని నిర్ణయించారు. ఈ సభకు తొలుత జిల్లా ఎస్పీ అనుమతులు ఇచ్చారు. అనంతరం అకస్మాతుగా అనుమతులు రద్దు చేస్తున్నట్లు బుధవారం నాడు ప్రకటించారు. దీనిపై ఆగ్రహించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు.. తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. తొలుత అనుమతులు ఇచ్చి ఆపై నిరాకరించారంటూ పిటిషన్ వేశారు. సభకు అనుమతులు ఇప్పించాలని న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై నేడు ధర్మాసనం విచారణ చేపట్టగా.. శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందనే హరీశ్ రావుకి అనుమతి నిరాకరించినట్లు పోలీసుల తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. ముందస్తు అనుమతి తీసుకున్నా చివరి నిమిషంలో నిరాకరించారని హరీశ్ రావు తరఫు న్యాయవాది తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం సభకు పర్మిషన్ ఇస్తూ ఆదేశాలిచ్చింది.

# కోర్టు తీర్పు వచ్చే వరకు ఆగలేరా

### అప్పుడే వెళ్లి రైతులను వేధించాలా

### హైడ్రా తీరుపై మండిపడ్డ మందకృష్ణ మాదిగ

**సంగారెడ్డి, ఏప్రిల్ 8 :** ఐలాపూర్‌లోని సర్వే నంబర్ -1 నుంచి 220 వరకు గల 1265 ఎకరాల భూమి భూ వివాదంలో పేద రైతులను హైడ్రా ఇబ్బంది పెట్టడం సరికాదని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివాదాస్పద భూములతో సంబంధం లేని రైతులను భయభ్రాంతులకు గురిచేయటం దారుణమని మంద కృష్ణ మాదిగ చెప్పారు. కోర్టు పరిధిలో ఉన్న కేసుల్లో తీర్పు వచ్చేంతవరకు హైడ్రా అధికారులు సంయమనం పాటించాలని సూచించారు. ఈ మేరకు హైడ్రాపై ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ షాకింగ్ కామెంట్స్ చేశారు. బుధవారం అమీన్ పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలోని వివాదంలో ఉన్న భూముల రైతులను మంద కృష్ణ మాదిగ, హైకోర్టు అడ్వకేట్ ముఖీం పరామర్శించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడారు. కోర్టు పరిధిలో లేని భూములకు సంబంధించిన రైతుల జోలికి హైడ్రా, రెవెన్యూ అధికారులు రావొద్దని కోరారు. రైతులకు ఉన్న లీగల్ హక్కులకు భంగం వాటిల్లితే సహించబోమని హెచ్చరించారు. ఏదైనా కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా దృష్టి పెడితే ఏ సమస్య ఉండదని తెలిపారు. హైడ్రా తన పరిధిలో పనిచేస్తుందా, అతిక్రమిస్తుందా అనే అంశంపై ఒకసారి ముఖ్యమంత్రి పరిశీలించాలని అన్నారు. హైడ్రా పరిధిలో ఉన్న భూ వివాదాలు పరిష్కారానికి ప్రత్యేక కోర్టు అవసరం ఉందని చెప్పుకొచ్చారు. హైడ్రా అనవసర జోక్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం ఉందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని మంద కృష్ణ మాదిగ పేర్కొన్నారు.





# తాగుబోతు ర్యాష్ డ్రైవింగ్ ముగ్గురి మృతి

## వంద మీటర్ల వరకు ఈడ్చుకెళ్లిన కారు

### మృతుల్లో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు, మరో యువకుడు

### ఘటనాస్థలంలో విద్యార్థుల భారీ ఆందోళన..

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** ఓ తాగుబోతు డ్రైవర్ సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. మూడు కుటుంబాల్లో కడుపుకోత పెట్టాడు. ముగ్గురు యువకులు దర్మరణం చెందారు. భవిష్యత్‌పై ఎంతో కలలతో ఇంజనీరింగ్‌లో అడుగుపెట్టిన ఇద్దరు విద్యార్థులు అసువులు బాసారు. వివరాల్లోకి వెళితే.. సాగర్ రోడ్డు హస్తినాపురం వద్ద బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మద్యం మత్తులో కారు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఓ వ్యక్తి.. ద్విచక్ర వాహనాన్ని, నడిచి వెళ్తున్న మరో యువకుడిని ఢీకొట్టాడు. వీరిని వంద మీటర్ల వరకు ఈడ్చుకెళ్లి కారు పల్టీ కొట్టింది. ఘటనలో ద్విచక్రవాహంపై వెళ్తున్న మహావీర్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు శివ, సందీప్ మృతి చెందారు. రోడ్డుపై నడిచివెళ్తున్న మరో యువకుడు కూడా మృతి చెందాడు. దీంతో కారు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కళాశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. డ్రైవర్‌ను తమకు అప్పగించాలని విద్యార్థులు నినాదాలు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. భారీగా పోలీసులు మోహరించడంతో పోలీసులకు విద్యార్థులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ప్రమాదం చేసిన వ్యక్తిని తమకు అప్పగించాలని విద్యార్థులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పైలట్ శిక్షణకు వచ్చిన యువతిపై లైంగికదాడి

### యువతిపై ట్రైనీ ఇన్‌స్ట్రక్టర్ పలుమార్లు అఘాయిత్యం



**హైదరాబాద్, ఏప్రిల్ 8:** బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. ఏవికన్స్ పైలెట్ శిక్షణ సంస్థలో శిక్షణ తీసుకుంటున్న యువతిపై ట్రైనీ ఇన్ స్పెక్టర్ లైంగికదాడికి పాల్పడ్డాడు. అదే సంస్థలో శిక్షణ ఇన్స్పెక్టర్‌గా పని చేస్తున్న కేరళకు చెందిన నసిముద్దీన్ యువతిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ కేసులో నసీముద్దీన్ కు సహకరించిన దమ్మాయిగూడ కు చెందిన మరొక శిక్షణ ఇచ్చే ఇన్స్పెక్టర్ సల్మాన్. యువతిపై లైంగికదాడి జరిపి వీడియోలు ఫోటోలు తీసుకుని పలుమార్లు బెదిరింపులకు పాల్పడ్డాడు నసీముద్దీన్. ట్రైనింగ్ కోసం వచ్చిన యువతిని మాయ మాటలతో లొంగ దీసుకున్న ట్రైనర్ నసిముద్దీన్. పలు మార్లు వేధింపులకు పాల్పడడంతో యువతి ట్రైనింగ్ ఆపేసింది. 2025 అత్యాచారం జరిగిన ప్రాంతం బేగంపేట పరిధిలో ఉ ఒడడం తో బేగంపేట పోలిస్ లకు ఫిర్యాదు చేసింది. జనవరి 2025 నుండి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డట్లు ఫిర్యాదులో బాధితురాలు పేర్కొన్నది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన బేగంపేట పోలీసులు నసీముద్దీన్ ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

# వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌పై రాళ్ల దాడి

### తిమ్మాపూర్ వద్ద అంతర్రాష్ట్ర ముఠా బీభత్సం!

### పోలీసులనే చుట్టుముట్టిన 30 మంది దుండగులు

### సినీ ఫక్కీలో ఛేజింగ్.. ఇద్దరు మహిళలు అరెస్ట్

**తిమ్మాపూర్, ఏప్రిల్ 8 :** తెలంగాణలో రైలు ప్రయాణికులను వణికించే ఘటన చోటుచేసుకుంది. ఒడిశా, బిహార్ తరహాలో రైలుపై భారీస్థాయిలో రాళ్లదాడి జరగడం రాష్ట్రంలో కలకలం రేపింది. సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని దుండగులు మెరుపు దాడికి పాల్పడ్డారు. గస్తీ పోలీసులు సకాలంలో స్పందించి ఎదురుదాడి చేయడంతో పెను ప్రమాదం తప్పినప్పటికీ, నిందితులను పట్టుకునే క్రమంలో జరిగిన ఛేజింగ్ ఉత్కంఠ రేకెత్తించింది. తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో ఈ ఘోరం జరిగింది. రైలు వెళ్తున్న సమయంలో ట్రాక్ పక్కన పొదల్లో మాటువేసిన సుమారు 30 మంది దుండగుల ముఠా ఒక్కసారిగా రైలుపై రాళ్ల వర్షం కురిపించింది. కిటికీలు, బోగీలకు రాళ్లు బలంగా తగలడంతో ప్రయాణికులు ఏం జరుగుతుందో తెలియక భయాందోళనలకు గురయ్యారు. సరిగ్గా అదే సమయంలో రైల్వే ట్రాక్ సమీపంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు ఆ గుంపును గమనించి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ముఠాను పట్టుకునేందుకు పోలీసులు యత్నించగా, ఆ 30 మంది సభ్యులు పోలీసులనే రౌండప్ చేసి దాడికి తెగబడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో గస్తీ పోలీసులు వెంటనే అదనపు బలగాల సాయం కోరారు. భారీగా పోలీసులు వస్తున్నారని గమనించిన దుండగులు అక్కడి నుంచి పరుగులు తీశారు. పోలీసులు వారిని కిలోమీటర్ల మేర ఛేజ్ చేశారు. నందిగామ మండలంలోని ఎన్‌సీఎల్ వెంచర్ గుండా చీకట్లో పడి నిందితులు తప్పించుకున్నారు. ఈ క్రమంలో ముఠాలోని ఇద్దరు మహిళలు పోలీసులకు చిక్కారు. పట్టుబడిన మహిళలను బిహార్, ఒడిశా లేదా రాజస్థాన్‌కు చెందిన అంతర్రాష్ట్ర ముఠా సభ్యులుగా పోలీసులు అనుమానిస్తున్నారు.

# ఖర్చుగా కాదు.. భాగస్వామ్యంగా చూడండి..

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వంతో పాటు కంపెనీలు కలిపి చేసే వ్యయంతో తెలంగాణ విద్యార్థులను ప్రపంచ స్థాయి నైపుణ్యం ఉన్న వారిగా తీర్చిదిద్ది భవిష్యత్ అవకాశాలను వారు అందిపుచ్చుకునేలా తయారు చేయగలమని సీఎం అన్నారు. విద్యపై పెట్టే వ్యయాన్ని తాము భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా భావిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థుల సంఖ్యలో హైదరాబాద్ నగరంలోనే 44 శాతం ఉన్నారని.. వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. కంపెనీలు స్థానికంగా ఉన్న అన్ని మౌలిక వసతులను వినియోగించు కుంటున్నందున తమ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ మొత్తాన్ని అదే ప్రాంత అభివృద్ధికి కేటాయించాలన్నారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంలో ఇప్పటి వరకు సరైన విధానం లేనందున తాము ఒక ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఇందుకు నియమించామని సీఎం తెలిపారు. కంపెనీల ప్రతినిధులు ఆయనతో సమన్వయం చేసుకొని తమకు ఆసక్తి ఉన్న విద్యా, వైద్యం, జల వనరులు, నైపుణ్య శిక్షణ, వారసత్వ కట్టడాల పరిరక్షణ, అడవుల



సంరక్షణ ఇలా దేనికైనా సీఎస్ఆర్ నిధులు వినియోగించవచ్చని సీఎం తెలిపారు. ఇప్పటికే రహేజా గ్రూప్ రూ.50 కోట్లు, రాంకీ గ్రూప్ రూ.50 కోట్లు, యశోద ఫౌండేషన్ రూ.10 కోట్లు విద్యాభివృద్ధికి కేటాయించేందుకు ముందుకు వచ్చాయని.. వారికి సీఎం అభినందనలు తెలిపారు. కంపెనీల ప్రతినిధులు స్పందిస్తూ సీఎస్ఆర్ నిధుల విషయంలో ఇప్పటి వరకు ఇలా ఎవరూ తమను సంప్రదించలేదని తెలిపారు. ఈ విషయంలో చొరవ తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. పాఠశాల విద్యా, ఆసుపత్రులు, వారసత్వ కట్టడాల పరిరక్షణకు వారు ఆసక్తి చూపారు.. సమావేశంలో రహేజా ఫౌండేషన్ నుంచి శ్రావణ్ కుమార్, రాంకీ ఫౌండేషన్ నుంచి దాక్షయణి ఆళ్ల, యశోద ఆసుపత్రి నుంచి డాక్టర్ గోరుకంటి సురేందర్ రావు, గోరుకంటి ఫల్గుణ్ రావు, మేఘా నుంచి సుధా రెడ్డి, అపోలో ఆసుపత్రి నుంచి అపర్ణా రెడ్డి, కామినేని భాస్కర్ రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుంచి శేఖర్ రెడ్డి, పగిడిపాటి దేవయ్య, రుద్రమదేవి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటేష్ ధోత్రే, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేతలో టెండర్ల విధానం రద్దు చేయండి

- సీఎం రేవంత్‌తో ఘనా హైకమిషనర్ భేటీ
- సీఎంతో భేటీ అయిన టాటా ఏరోస్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ టిమ్ రైఫిల్

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఘనా హైకమిషనర్ క్వాసి ఒబిరి-డాన్సో మర్యాదపూర్వకంగా కలిసిన రిపబ్లిక్ ఆఫ్ ఘనా హైకమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా హైదరాబాద్ కు వచ్చిన క్వాసి ఒబిరి-డాన్ సిఎంను ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఘనా, తెలంగాణ మధ్య సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించిన హైకమిషనర్. విద్య, శాస్త్ర సాంకేతిక రంగాలు, ఆరోగ్య, వాణిజ్య రంగాల్లో పరస్పర సహకారం ఉండాలని కోరిన హైకమిషనర్. సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత ఆయనకు శాలువాతో సన్మానించారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టాటా ఏరోస్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ టిమ్ రైఫిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. భారతదేశంలో ఎప్-130ఏ సూపర్ హెర్క్యులస్ ఫైనల్ అసెంబ్లీ లైన్‌ను ఏర్పాటు చేయనున్న లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ. అంతర్జాతీయ అవసరాల కోసం భారతదేశంలోని టిఏఎస్ఎల్ లో ఈ-16 వింగ్స్ ను ఉత్పత్తి చేసేందుకు లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నది. తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నట్లు ఈ సందర్భంగా టిమ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



# తెలంగాణలో మరో రెండు ఎయిర్‌పోర్టులు

- వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు త్వరలో శంకుస్థాపన
- వెల్లడించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



**హైదరాబాద్, ఏప్రిల్ 8:** తెలంగాణ ప్రజలకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు గుడ్ న్యూస్ చెప్పారు. రాష్ట్రంలో మరికొన్ని రోజుల్లో రెండు నూతన విమానాశ్రయాలు నిర్మించబోతున్నట్లు ప్రకటించారు. వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎయిర్‌పోర్టులు నిర్మించనున్నట్లు తెలిపారు. వరంగల్ విమానాశ్రయానికి మూడు నెలల్లో శంకుస్థాపన జరగనుందని కేంద్ర మంత్రి శుభవార్త చెప్పారు. అలాగే ఆదిలాబాద్‌లోనూ మరో కొత్త ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని కేంద్ర రక్షణ శాఖ నిర్ణయం తీసుకుందని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖకు చెందిన 360 ఎకరాల్లో నూతన ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ పేర్కొన్నారు. ఈ విమానాశ్రయాన్ని రక్షణ శాఖ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. రక్షణ శాఖకు సంబంధించి శిక్షణ కోసం ఈ విమానాశ్రయాన్ని వినియోగించు కోవాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదించినట్లు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. అదే విమానాశ్రయంలో పౌర విమానయాన శాఖ టెర్మినల్ నిర్మాణం చేసుకునేందుకు రక్షణ మంత్రి అంగీకారం తెలిపారని ఆయన చెప్పారు. రక్షణ శాఖ అవసరాలతోపాటు సాధారణ విమాన సర్వీసులు కూడా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ తెలిపారు. ఈనెల 17వ తేదీన అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం రక్షణ శాఖ తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన వెల్లడించారు. త్వరలోనే వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణం ప్రారంభం కానుందంటూ తీపి కబురు చెప్పారు. సుమారు 430 ఎకరాలుంటే ఎయిర్ బస్ రాకపోకలకు వీలుగా విమానాశ్రయం ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని చెప్పారు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు. ఇదే విషయంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. వరంగల్ విమానాశ్రయానికి సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్ స్ట్రిప్ ఉందని.. ఆ స్థలంలో నూతన విమానాశ్రయం కట్టాలని చాలాకాలంగా డిమాండ్ ఉందని చెప్పుకొచ్చారు. ఈ విషయంపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్, విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి చర్చించినట్లు కిషన్ రెడ్డి తెలిపారు.

# కాళేశ్వరం విచారణపై కొనసాగుతున్న 'ఘోష్' సస్పెన్స్!

### పీసీ ఘోష్ కమిషన్ చెల్లుబాటుపై తీర్పు వాయిదా

### 22న తుది నిర్ణయం వెలువరించనున్న హైకోర్టు

### మాజీ సీఎం కేసీఆర్ సహా పలువురు ప్రముఖుల పిటిషన్లపై ఉత్కంఠ

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ భవితవ్యంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ కమిషన్ ఏర్పాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు తీర్పును ఈ నెల 22కు వాయిదా వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణల్లో అవకతవకలపై విచారణ నిమిత్తం ఏర్పాటు చేసిన జస్టిస్ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్‌లపై ఇప్పటికే కోర్టు వాదనలు విన్నది. బుధవారం తీర్పు వెలువరించాల్సి ఉండగా.. తీర్పును వాయిదా వేసింది. జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ ప్రభుత్వం 2024 మార్చి 14న జీవో 6ను జారీ చేసింది. దీన్ని సవాలు చేస్తూ భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్, ఐఏఎస్ మాజీ అధికారి ఎస్.కె.జోషిలు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణలో జరిగిన అవకతవకలపై విచారణకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చెల్లుబాటుపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. అయితే, ఈ వ్యవహారంపై



తీర్పును ధర్మాసనం ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసింది. కాళేశ్వరం అవకతవకలపై విచారణ కోసం 2024 మార్చి 14వ తేదీన ప్రభుత్వం జీవో నంబర్ 6ను జారీ చేస్తూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. ఈ జీవోను సవాల్ చేస్తూ రాష్ట్రంలోని పలువురు కీలక నేతలు, అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చేపట్టిన విచారణ ప్రక్రియలో నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని పిటిషనర్లు పేర్కొన్నారు. తమపై అభియోగాలు మోపే ముందు, తమ వాదనలను కమిషన్ పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా విచారణ సాగుతోందని వారు కోర్టుకు విన్నవించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలను వెలికితీసేందుకే జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. కమిషన్ తన నివేదికను అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగానే సిద్ధం చేసిందని కోర్టుకు తెలిపింది. విచారణలో భాగంగా పిటిషనర్లందరికీ నోటీసులు ఇచ్చి, నిబంధనల ప్రకారమే ముందుకు వెళ్తున్నామని, కాబట్టి ఈ పిటిషన్లను కొట్టివేయాలని ప్రభుత్వం కోరింది. చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని బెంచ్ ఇరుపక్షాల వాదనలను సుదీర్ఘంగా విన్న తర్వాత, నేడు వెలువరించాల్సిన తీర్పును ఈ నెల 22వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ | గురువారం 09 ఏప్రియల్ 2026



సంపాదకీయం

# ప్రపంచాన్ని బలి చేసిన 'ట్రంప్' యుద్ధోన్మాదం

## అమెరికా ఆధిపత్య కాంక్షకు సామాన్యులే బలి!

అగ్రరాజ్యం తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి చేసే ప్రయత్నాలు సామాన్య దేశాలకు శాపంగా మారుతున్నాయి. అమెరికా-ఇజ్రాయిల్‌ల యుద్ధ కాంక్ష వల్ల ఇరాన్ చితికిపోవడమే కాదు, ప్రపంచమంతా చమురు సెగతో విలవిల్లాడుతోంది. తాత్కాలిక కాల్పుల విరమణ కాదు, శాశ్వత శాంతే ప్రపంచానికి అవసరం. రాజకీయ ప్రయోజనాల కోసం దేశాల మధ్య చిచ్చు పెట్టడం అగ్రరాజ్యాలకు అలవాటుగా మారింది. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరియు ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూల నిరంకుశ వైఖరి వల్ల మధ్యప్రాచ్యం అగ్నిగుండంగా మారింది. ఇరాన్‌పై బాంబు దాడులు చేయడం, ఆ దేశ అత్యున్నత నేత అయతుల్లా ఆలీ ఖమేనీని లక్ష్యంగా చేసుకోవడం ద్వారా అమెరికా సాధించింది శూన్యం. కానీ, ఈ యుద్ధ జ్వాలలు సృష్టించిన విధ్వంసం మాత్రం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదేలు చేసింది.

### చమురు దౌత్యం.. డాలర్ ఆధిపత్యం

అమెరికా ఇరాన్‌పై దాడికి దిగడం వెనుక కేవలం రాజకీయ కారణాలే లేవు, ప్రధానంగా ముడి చమురుపై పెత్తనం మరియు 'డాలర్' సర్వాధిపత్యాన్ని కాపాడుకోవాలన్న తాపత్రయం కనిపిస్తోంది. వెనెజువెలా తరవాత ఇరాన్‌ను లొంగదీసుకోవడం సులభమని భావించిన ట్రంప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్ ప్రతిస్పందనగా హోర్ముజ్ జలసంధిని మూసివేయడంతో ప్రపంచ చమురు సరఫరా అస్తవ్యస్తమైంది. ప్రపంచ ముడి చమురు రవాణాలో 20 శాతం కేవలం ఈ చిన్న జలసంధి ద్వారానే జరుగుతుంది. దీనిని మూసివేయడం అంటే ప్రపంచ ఆర్థిక నరాలను తెంచడమే. రవాణాకు ఆటంకం ఏర్పడటంతో ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకాయి. చమురు ధరల్లో స్వల్ప మార్పు వచ్చినా అది రవాణా, విద్యుత్, ఉత్పత్తి రంగాలపై పెను ప్రభావం చూపుతుంది. నేడు విమాన ప్రయాణాలు భారంగా మారడం నుంచి అంతర్జాతీయ విమానాలు రద్దు కావడం వరకు అన్నీ ఈ యుద్ధోన్మాద ఫలితాలే.

### ద్రవ్యోల్బణం: మూడవ ప్రపంచ దేశాల పాలిట శాపం

ఈ యుద్ధం వల్ల ధనిక దేశాల కంటే ఆసియా, ఆఫ్రికా వంటి మూడవ ప్రపంచ దేశాలే ఎక్కువగా నష్టపోతున్నాయి. చమురు ధరలు పెరగడంతో డాలర్ విలువ పెరిగి, స్థానిక కరెన్సీల విలువ పడిపోతోంది. ఫలితంగా ద్రవ్యోల్బణం పెరిగి సామాన్యుడి కొనుగోలు శక్తి హరించుకుపోతోంది. కేవలం చమురు మాత్రమే కాదు, దాని ఆధారిత ఉత్పత్తులైన ఎరువుల కొరత ఏర్పడి, వ్యవసాయ రంగం సంక్షోభంలో పడింది. ఇది ఆహారధాన్యాల కొరతకు దారి తీసి, శ్రామిక ప్రజానీకాన్ని ఆకలి కోరల్లోకి నెట్టే ప్రమాదాన్ని సూచిస్తోంది. డాలర్ విలువ ముడిచమురుతో ముడిపడి ఉంది. డాలర్ ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలు పెట్టుబడిదారీ ప్రపంచ స్థిరత్వాన్నే ప్రమాదంలో పడేస్తున్నాయి. చమురు-డాలర్ ప్రమాణాన్ని నిలబెట్టుకోవడం కోసం చమురు ఉత్పత్తి దేశాలపై రాజకీయ ఆధిపత్యాన్ని చెలాయించడానికి అమెరికా పూనుకుంటోంది.

### బెడిసికొట్టిన వ్యూహం.. మేల్కొని ప్రపంచం

ఇరాన్‌లో తమకు అనుకూలమైన కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న అమెరికా వ్యూహం పూర్తిగా బెడిసికొట్టింది. ఏకపక్ష దాడులు చేస్తే ఎదురుదాడులు తప్పవని ఇరాన్ చర్యలు నిరూపించాయి. ట్రంప్ ప్రకటించిన రెండు వారాల తాత్కాలిక యుద్ధ విరమణ కేవలం రాజకీయ ఎత్తుగడ మాత్రమే. నిజానికి యుద్ధాన్ని శాశ్వతంగా ఆపేసి, ఇరాన్ సహా నష్టపోయిన దేశాల పునర్నిర్మాణంలో అమెరికా భాగస్వామి కావాలి. సామ్రాజ్యవాద విస్తరణ, ముడిపదార్థాల కోసం ఆక్రమణ యత్నాలు ఇకపై సాగవని ట్రంప్ తెలుసుకోవాలి. వెనెజువెలాలో చేసిన ప్రయోగాలు ఇరాన్‌లో పారవని ఈ నెల రోజుల అనుభవం స్పష్టం చేసింది. ఒక అగ్రరాజ్యం తన అహంకారం కోసం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అల్లకల్లోలం చేయడం అత్యంత అనైతికం మరియు చట్టవిరుద్ధం.

**ముడి పదార్థాలపై అదుపు సాధించడం కోసం యుద్ధాలు చేయడం వల్ల ప్రపంచం చెల్లిస్తున్న మూల్యం అపారం. పెట్టుబడిదారీ ప్రపంచం స్థిరంగా ఉండాలంటే శాంతి అవసరం. ఇప్పటికైనా అమెరికా తన యుద్ధోన్మాదాన్ని వీడాలి. కేవలం తన డాలర్ ప్రయోజనాల కోసం ప్రపంచాన్ని ఆర్థిక మాంద్యం అనే అగాధంలోకి నెట్టడం ఆపాలి. అప్పుడే ప్రపంచ దేశాలు, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు ఊపిరి పీల్చుకోగలవు.**



# ఇరాన్‌తో యుద్ధానికి పక్షం విరామం

- 15 రోజుల సీజ్‌ఫైర్ ప్రకటించిన ట్రంప్
- హర్మ్యూజ్‌పై సుంకాలు విధింపును సమర్థించుకున్న ఇరాన్



**వాషింగ్టన్, ఏప్రిల్ 8:** గత 40 రోజులుగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. అమెరికా-ఇరాన్ మధ్య రెండు వారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఇరాన్‌పై దాడులను రెండు వారాల పాటు ఆపేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం తాత్కాలికంగా నిలిచిపోయింది. ఇరాన్, అమెరికాల మధ్య 15 రోజుల సీజ్ ఫైర్ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంపై ట్రంప్ తన సొంత సోషల్ మీడియా 'ది ట్రూత్'లో వరుస పోస్టులు పెడుతున్నారు. తాజాగా, 'ప్రపంచ శాంతికి ఇది గొప్ప రోజు. ఇరాన్‌తో పాటు ఇతర దేశాలు కూడా శాంతి కోరుకుంటున్నాయి. హోర్ముజ్ జలసంధిలో ట్రాఫిక్ క్లియరెన్స్‌కు సహకరిస్తాం' అని రాసుకొచ్చారు. అమెరికా సీజ్ ఫైర్ నిర్ణయానికి ఇజ్రాయెల్ కూడా మద్దతు తెలిపింది. లెబెనాన్ విషయంలో మాత్రం వెనక్కు తగ్గేది లేదని స్పష్టం చేసింది. ఇరాన్, అమెరికా దేశాల మధ్య సీజ్ ఫైర్ ఒప్పందం జరిగినా కూడా హోర్ముజ్ విషయంలో ఇరాన్ మాత్రం వెనక్కు తగ్గటం లేదు. ఇప్పటికీ ఇరాన్ నియంత్రణలోనే హోర్ముజ్ జలసంధి ఉంది. హోర్ముజ్‌లో షిప్పుల నుంచి ఇరాన్ భారీ మొత్తంలో టోల్ వసూలు చేస్తోంది. టోల్ ఫీజు ఆదాయాన్ని పునర్నిర్మాణానికి ఖర్చు చేస్తామని అంటోంది. పాకిస్థాన్ ప్రధాని సూచనల మేరకే గడువును పొడిగించినట్టు ట్రంప్ తెలిపారు. అయితే కాల్పుల విరమణ ఒప్పందానికి ఇరాన్ అంగీకరించడం వెనుక చైనా కీలక పాత్ర పోషించిందని వార్తలు వస్తున్నాయి. 'కాల్పుల విరమణపై చర్చలు జరపడానికి టెహ్రాన్‌ను ఒప్పించడంలో చైనా ప్రమేయం ఉందా' అని విలేకరులు ప్రశ్నించినపుడు 'అవుననే అనుకుంటున్నా. నేను కూడా విన్నాను' అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ఏడాది మే నెలలో చైనా పర్యటనకు ట్రంప్ వెళ్లబోతున్నారు. ఆ సమయం లోపునే ఈ యుద్ధం ముగిసిపోవాలని చైనా భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పాకిస్థాన్, టర్కీ, ఈజిప్ట వంటి మధ్యవర్తుల ద్వారా ఇరాన్‌ను శాంతి మార్గం వైపు నడిపించడంలో చైనా నిశబ్దంగా పని చేసిందని వార్తలు వస్తున్నాయి. ఇరాన్ యుద్ధంలో బీజింగ్ పాత్రపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటనా జారీ చేయలేదు. నిజానికి ఈ యుద్ధం ఆగడం చైనాకు కూడా చాలా కీలకం. ఎందుకంటే చైనాకు ఇరాన్ ప్రధాన ఆయిల్ సరఫరాదారు. హోర్ముజ్ జలసంధి మూసి వేసి ఉండడం చైనా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలోనే శాంతి చర్చల విషయమై చైనా అధికారులు నేరుగా ఇరాన్ నాయకులతోనే సంప్రదింపులు జరిపినట్టు సమాచారం. ఏదేమైనా, భవిష్యత్తులో ప్రపంచ రాజకీయాల్లో చైనా ప్రభావం మరింత పెరుగుతుందనేందుకు ఈ పరిణామం కీలక సంకేతం.

# ఇది యుద్ధానికి ముగింపు కాదు

- మొజ్తాబా ఖమేనీ సంచలనం
- 10న ఇస్లామాబాద్‌లో చర్చలు



**టెహ్రాన్/వాషింగ్టన్, ఏప్రిల్ 8:** ప్రపంచం ఊపిరి పీల్చుకునే వార్త.. యుద్ధ మేఘాల మధ్య చిన్న ఆశారేఖ! గత కొద్దిరోజులుగా పశ్చిమాసియాను వణికించిన అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఇరు దేశాల మధ్య రెండు వారాల పాటు 'కాల్పుల విరమణ' ఒప్పందం కుదిరింది. అయితే, ఈ శాంతి కేవలం 'తాత్కాలికమే' అని, యుద్ధం ముగిసిందని ఎవరూ భ్రమపడొద్దని ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ఇచ్చిన హెచ్చరిక ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన వెంటనే ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ఒక ప్రకటన విడుదల చేశారు. "ఇది యుద్ధానికి ముగింపు కాదు.. కేవలం విరామం మాత్రమే. మా సైన్యం వేళ్లు ఇంకా గన్ ట్రిగ్గర్‌ల పైనే ఉన్నాయి. శత్రువు ఏమాత్రం దురాక్రమణకు పాల్పడినా పూర్తి బలంతో ధీటుగా స్పందిస్తాం" అని స్పష్టం చేశారు. అయితే, ప్రస్తుతానికి తక్షణమే దాడులు నిలిపివేయాలని తన సైనిక విభాగాలను ఆయన ఆదేశించారు.

### పాక్ మధ్యవర్తిత్వానికి ట్రంప్ గ్రీన్ సిగ్నల్

పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన ప్రతిపాదనకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సానుకూలంగా స్పందించారు. హర్మ్యూజ్ జలసంధిని తెరిచేందుకు ఇరాన్ అంగీకరించడంతో, రెండు వారాల పాటు దాడులు చేయబోమని ట్రంప్ ప్రకటించారు. పశ్చిమాసియాలో శాశ్వత శాంతి నెలకొల్పడానికి ఈ 14 రోజుల గడువు ఉపయోగపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరాన్ పెట్టిన 10 ప్రధాన డిమాండ్లు (ఆంక్షల ఎత్తివేత, హర్మ్యూజ్‌పై నియంత్రణ వంటివి) కూడా సానుకూలంగా ఉన్నాయని ట్రంప్ పేర్కొనడం గమనార్హం.

### ఇస్లామాబాద్‌లో 'మహా' చర్చలు:

శాంతి ప్రయత్నాలను ముందుకు తీసుకెళ్లేందుకు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇరు దేశాల ప్రతినిధులను ఆహ్వానించారు. ఏప్రిల్ 10న ఇస్లామాబాద్‌లో జరగనున్న ప్రత్యక్ష చర్చల్లో అమెరికా, ఇరాన్ ప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ చర్చల గురించి వైట్‌హౌస్ స్పందిస్తూ.. తుది నిర్ణయం అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటారని వెల్లడించింది. ప్రపంచ చమురు మార్కెట్ కుప్పకూలకుండా ఉండాలంటే ఈ చర్చలు సఫలం కావడం అత్యంత అవసరమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## అమెరికాకు మద్దతిస్తాం.. కానీ

అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పందించారు. ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మద్దతిస్తామన్నారు. అయితే, ఈ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదని స్పష్టంచేశారు. నెతన్యాహు కార్యాలయం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. హర్మ్యూజ్ జలసంధిని ఇరాన్ తిరిగి తెరవడం, ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాలపై దాడులు నిలిపివేయడం వంటి షరతులకు లోబడి.. రెండు వారాల కాల్పుల విరమణకు ట్రంప్ తీసుకున్న నిర్ణయానికి మద్దతిస్తున్నట్లు పేర్కొంది. దీంతోపాటు ఇరాన్ అణు, క్షిపణి, ఉగ్రవాదం నుంచి ప్రపంచానికి ముప్పు కలగకుండా అమెరికా చేస్తున్న ప్రయత్నాలను సమర్థిస్తున్నట్లు తెలిపింది. ఇరాన్‌తో జరగబోయే చర్చల్లో.. యూఎస్, ఇజ్రాయెల్, దాని మిత్రదేశాల లక్ష్యాలను సాధించేందుకు తాము కట్టుబడి ఉన్నామని అగ్రరాజ్యం తమకు హామీ ఇచ్చినట్లు వెల్లడించింది. అయితే, ఈ కాల్పుల విరమణ లెబనాన్ కు వర్తించదని తేల్చి చెప్పేసింది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటన ఇందుకు విభిన్నంగా ఉంది. అమెరికా- ఇరాన్ అంగీకరించిన కాల్పుల విరమణ ఒప్పందం లెబనాన్‌కు కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు.

### లెబనాన్‌పై దాడులు..

లెబనాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. దక్షిణ లెబనాన్‌లోని ఓ నగరం లక్ష్యంగా ఐడీఎఫ్ దళాలు దాడులు చేశాయి. తమ మిత్రదేశాలపై కూడా ఎలాంటి దాడులు చేయకూడదని ఇరాన్ ప్రతిపాదించిన తన 10 పాయింట్‌లలో పేర్కొంది. అయినప్పటికీ.. ఇజ్రాయెల్ తన దాడులను కొనసాగించడం గమనార్హం.

# యుద్ధ విరమణతో మార్కెట్లకు జోష్

### భారీ లాభాల్లో ప్రారంభం అయిన దేశీయ సూచీలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** ఇరాన్‌పై రెండు వారాల పాటు దాడులు చేయబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం అంతర్జాతీయ మార్కెట్లలో ఫుల్ జోష్ తీసుకొచ్చింది. మరోవైపు అంతర్జాతీయంగా చమురు ధరలు కూడా భారీగా దిగి వచ్చాయి. ఈ నేపథ్యంలో దేశీయ సూచీలు కూడా భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ బలపడింది. సెన్సెక్స్, నిఫ్టీ మూడు శాతానికి పైగా లాభంతో ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం దాదాపు అన్ని రంగాలూ లాభాల్లోనే కదలాడుతున్నాయి. గత సెషన్ ముగింపు (74,616)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు 2500 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ జోరు కొనసాగుతోంది. చాలా రోజుల తర్వాత 77 వేల మార్క్ దాటింది. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 2670 పాయింట్ల లాభంతో 77,286 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా లాభాల బాటలోనే సాగుతోంది. ప్రస్తుతం 777 పాయింట్ల నష్టంతో 23,900 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్, నిఫ్టీలో అశోక్ లేలాండ్, ప్రెస్టీజ్ ఎస్టేట్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, మదర్సన్, ఎల్ అండ్ టీ ఫైనాన్స్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి . ఆయిల్ ఇండియా, నాల్కో, ఓఎన్‌జీసీ, కోల్ ఇండియా, సన్ ఫార్మ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 1843 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 2473 పాయింట్ల లాభంతో ఉంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 92.55గా ఉంది.

# మరోమారు భారీగా పెరిగిన బంగారం ధరలు

### దాదాపు 4 వేల వరకు పెరిగిన తులం ధర

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** యుద్ధానికి తాత్కాలికంగా బ్రేక పడడంతో పసిడి ప్రియులకు షాక్ ఇచ్చే విధంగా బంగారం ధరలు భారీగా పెరిగాయి. మంగళవారం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం 1,49,840 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,37,350 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 1,12,380 దగ్గర ట్రేడ్ అయింది. గుడ్ రిటర్న్స్ వెబ్ సైట్ ప్రకారం బుధవారం 24 క్యారెట్లపై 3,980 రూపాయలు.. 22 క్యారెట్లపై 3,650 రూపాయలు.. 18 క్యారెట్లపై 2,990 రూపాయలు పెరిగింది. హైదరాబాద్ మార్కెట్‌లో ఉదయం పది గంటల ప్రాంతంలో బంగారం ధరలు ఇలా ఉన్నాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం 1,53,820 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,41,000 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,15,370 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. ఈ రోజు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. కేజీ వెండిపై పది వేలు పెరిగి 2,65,000 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 100 గ్రాముల వెండిపై వెయ్యి పెరిగి 26,500 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.

## సురక్షితంగా ఇరాన్‌ను వీడండి

### భారత ప్రజలకు కేంద్రం అడ్వయిజరీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** ఇరాన్‌లోని భారత పౌరులకు కేంద్రం మరోసారి అడ్వైజరీ జారీ చేసింది. వెంటనే ఆ దేశం నుంచి బయటపడాలని సూచించింది. ప్రస్తుత పరిణామాల దృష్ట్యా ఇరాన్‌లోని ఇండియన్ ఎంబసీ బుధవారం ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టింది. రాయబార కార్యాలయాన్ని ముందుగా సంప్రదించకుండా.. ఏ అంతర్జాతీయ సరిహద్దు సమీపంలోకి రావొద్దని పౌరులను హెచ్చరించింది. అలాగే కొన్ని హెల్ప్‌లైన్ నంబర్లను షేర్ చేసింది. ఇరాన్-అమెరికా (ఎసజీని-జాం) రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో ఈ సూచనలు జారీ కావడం గమనార్హం. నిన్న రాత్రి కూడా కేంద్ర విదేశాంగశాఖ అడ్వైజరీ జారీ చేసింది. అనవసర ప్రయాణాలు మానుకోవాలని సూచించింది. ఇళ్లల్లోనే ఉండాలని, అన్ని విద్యుత్, సైనిక స్థావరాలు, బహుళ అంతస్తుల భవనాలకు దూరంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం యుద్ధం తాత్కాలికంగా ఆగడంతో స్వదేశానికి రావాలనుకునేవారికి ఇదొక అవకాశంగా మారింది. ఇరాన్‌లో ఉన్న భారతీయులకు ఇరాన్‌లోని ఇండియన్ ఎంబసీ బుధవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇరాన్‌లో ఉన్న భారతీయులు వెంటనే దేశం విడిచి వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. అవసరమైతే భారత రాయబార కార్యాలయం సహాయం తీసుకోవాలని తెలిపింది. తాము సూచించిన మార్గాల్లో మాత్రమే దేశాన్ని వీడాలని ఎంబసీ ఆదేశించింది. ఎంబసీని సంప్రదించకుండా.. పర్మిషన్ తీసుకోకుండా అంతర్జాతీయ సరిహద్దుల వద్దకు వెళ్లరాదని హెచ్చరించింది. ఈ మేరకు ఎంబసీ బుధవారం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టింది.

## ప్రధానోపాధ్యాయుడిపై చర్యలేవి

**విచారణ కేవలం కాగితాలకే పరిమితమా**



**నేటి సాక్షి :** కౌతాళం మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి అవినీతి ఆరోపణలపై నిర్వహించిన విచారణపై ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యస్. ఈరేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమాల ఒత్తిడితో ఉన్నతాధికారులు డిప్యూటీ డి.ఇ.ఓకు విచారణ బాధ్యతలు అప్పగించినప్పటికీ, విచారణ తూతూ మంత్రంగానే జరిగిందని విమర్శించారు. పదో తరగతి పరీక్షల సమయంలో పాఠశాలను సందర్శించిన డిప్యూటీ డి.ఇ.ఓ, ప్రధానోపాధ్యాయుడు లేని వేళ విచారణ జరపడం అనుమానాలకు తావిస్తోందన్నారు. విచారణ పూర్తై రోజులు గడుస్తున్నా నివేదికను బహిర్గతం చేయకపోవడం వెనుక చీకటి ఒప్పందాలున్నాయేమోనని ప్రశ్నించారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా రక్షించే ప్రయత్నం జరిగితే అది విద్యా వ్యవస్థకు తీవ్ర నష్టం కలిగిస్తుందని హెచ్చరించారు. విచారణ నివేదికను వెంటనే ప్రజల ముందుంచి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడించడంతో పాటు జిల్లా వ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. దీనివల్ల కలిగే పరిణామాలకు విద్యాశాఖే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

## భార్యను ఆత్మహత్యకు ప్రేరేపించిన భర్తకు ఐదేళ్ల జైలు శిక్ష

**నేటి సాక్షి ,కోరుట్ల (రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లా కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో భార్యను వేధింపులకు గురిచేసి, ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్తకు 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ మెట్‌పల్లి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి డి. నాగేశ్వరరావు బుధవారం కీలక తీర్పు వెలువరించారు. వివరాల్లోకి వెళితే.. మెట్‌పల్లికి చెందిన లక్ష్మిని కోరుట్ల పట్టణంలోని చింతలవాడకు చెందిన గంధం స్వామితో వివాహం జరిపించారు. అయితే, స్వామి మద్యానికి బానిసై ప్రతిరోజూ భార్యను శారీరకంగా, మానసిక హింసకు గురిచేసేవాడు. 2015, ఆగస్టు 21న కూలి డబ్బుల విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. కూలి డబ్బులు రూ. 600 ఇవ్వకపోతే చచ్చిపోతానని లక్ష్మి అనగా, భర్త స్వామి ఆమెకు లైటర్ ఇచ్చి "పో.. పోయి చచ్చిపో" అని ప్రేరేపించాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన లక్ష్మి నిప్పంటించుకోగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అప్పటి సబ్ ఇన్‌స్పెక్టర్ జగదీష్ కేసు నమోదు చేసి, లోతుగా దర్యాప్తు చేపట్టారు. నిందితుడు గంధం స్వామి (38)పై నేరం రుజువు కావడంతో కోర్టు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 2,000 జరిమానా విధించింది. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా సాక్ష్యాధారాలను సమర్పించిన అదనపు పీపీ ఆనంద్, ఎస్సైలు జగదీష్, శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ వినోద్‌లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. స్పెక్టర్ జగదీష్ కేసు నమోదు చేసి, లోతుగా దర్యాప్తు చేపట్టారు. నిందితుడు గంధం స్వామి (38)పై నేరం రుజువు కావడంతో కోర్టు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా సాక్ష్యాధారాలను సమర్పించిన అదనపు పీపీ ఆనంద్, ఎస్సైలు జగదీష్, శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ వినోద్‌లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

## దివ్యాంగులకు స్వయం ఉపాధి

**ఆర్థిక స్వావలంబన చేకూర్చడమే లక్ష్యం**



**నేటి సాక్షి, గన్నేరువరం,( బుర్ర అంజయ్య గౌడ్):** దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పించి.. ఆర్థిక స్వావలంబన చేకూర్చడమే యూత్ ఫోర్ జాబ్స్ ఫౌండేషన్ లక్ష్యంగా పనిచేస్తుందని యూత్ ఫోర్ ఫౌండేషన్ తెలంగాణ అసిస్టెంట్ మేనేజర్ మాగాని రాజమౌళి పేర్కొన్నారు. బుధవారం గన్నేరువరం మండల కేంద్రంలోని యూత్ ఫోర్ ఫౌండేషన్ ఉచిత శిక్షణ సెంటర్ లో దివ్యాంగులకు స్వయం ఉపాధి పెంపొందినందుకు యూత్ ఫోర్ జాబ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ కోర్సులలో రెండు నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న దివ్యాంగులకు కుట్టు మిషన్, జిరాక్స్ మిషన్, వెజిటేబుల్,ఎలక్ట్రిషన్ ,ప్లంబింగ్ కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాగాని రాజమౌళి మాట్లాడుతూ. కరీంనగర్ జిల్లాలోని ఎనమిది మండలాలలో దివ్యాంగులకు ఉచితంగా కిట్లను పంపిణీ చేశామన్నారు . దివ్యాంగులకు స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా వారికి ప్రత్యేక శిక్షణను అందించి, స్వయం ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 8 మండలాల ఇంచార్జ్ లు మోరే కృష్ణ, దొడ్డే రాజు ,వార్డ్ మెంబర్ సందనవేణి రాములు, కోఆర్డినేటర్ పాశం ఎల్లయ్య, ట్రైనర్ శివరాత్రి శారద, దివ్యాంగుల పాల్గొన్నారు.


## పరీక్షిత్ సాయి పుట్టినరోజు

**విద్యార్థులకు వాటర్ బాటిళ్ల పంపిణీ**



**నేటి సాక్షి,చౌడేపల్లి:** పందిళ్ళపల్లి పాఠశాల నందు మాదిరాజు ప్రదీప్ రాజు తనయుడు పరీక్షిత్ సాయి పుట్టినరోజు వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపయోగపడేలా వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ప్రస్తుత ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, పాఠశాల పిల్లలకు తాగునీటి సౌకర్యం కోసం ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. విజయలక్ష్మి గారు ఇలా చిన్న పిల్లల మధ్య పుట్టినరోజు వేడుకలు జరపడం వారి మంచితనానికి, ఆ కుటుంబం యొక్క దానగుణానికి గొప్ప నిదర్శనమని స్థానికులు కొనియాడారు. ఆడంబరాలకు పోకుండా విద్యార్థులకు అవసరమైన వస్తువులను పంపిణీ చేయడం అభినందనీయమని పాఠశాల సిబ్బంది పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పద్మశాలి సంఘం నిధుల 'గోల్‌మాల్'




- భక్తి ముసుగులో 'వ్యాపారం అహంకారంతో 'విధ్వంసం
- 'అడ్ హాక్ కమిటీపై వివాదం సంప్రదాయానికి విరుద్ధమైన వైఖరి
- 'మార్కండేయ మందిర నిర్మాణ చరిత్ర'.. గంగుల వంశస్థుల సేవలు
- దేవాలయాల పేరుతో 'బిజినెస్' ఆరోపణలు.. లెక్కలు గల్లంతు
- రిజిస్ట్రేషన్..చందాల సేకరణలో 'అనుమానాలు'.?
- భక్తుల సొమ్ముతో వడ్డీ దందా.?.. బ్యాంక్ ఖాతాల తనిఖీ డిమాండ్

**నేటి సాక్షి,మెట్‌పల్లి (రాధారపు నర్సయ్య):** "నమ్మి నానవోస్తే..పుచ్చి బుర్రలు చేసినయటన్న..' సామెత లాంటి ముచ్చట ఒకటి మెట్‌పల్లిలో చర్చానీయాంశమవుతోంది.! మెట్‌పల్లి పద్మశాలి సంఘం మార్కండేయ మందిర నిర్మాణ నిధుల సేకరణలో మాజీ అధ్యక్షుడు ద్యావనపెల్లి రాజారాం సాగిస్తున్న అక్రమాల పర్వం ఇప్పుడు పట్టణంలో తీవ్ర దుమారం రేపుతోందంటున్నారు.! ఇది కేవలం నిధుల మళ్లింపు మాత్రమే కాదు, తరతరాల కుల వారసత్వాన్ని, దాతల నమ్మకాన్ని కాలరాసిన 'అహంకార పూరిత'చర్యగా కుల సభ్యులు అభివర్ణిస్తున్నారు. ఈ వ్యవహారం, భక్తి ముసుగులో 'వ్యాపారం'.. అహంకారంతో 'విధ్వంసం' అనే ఆరోపణల మధ్య మరింత వివాదాస్పదంగా మారిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

**అడ్ హాక్ కమిటీపై వివాదం..సంప్రదాయానికి విరుద్ధమైన వైఖరి.**

ఎన్నికల నిర్వహణ కోసం అడ్ హాక్ కమిటీని నియమించడంపై మాజీ కార్యవర్గం చేస్తున్న రాద్ధాంతం హాస్యాస్పదంగా ఉందని కుల పెద్దలు గుర్తుచేస్తున్నారు. మెట్‌పల్లి పద్మశాలి సంఘంలో గతంలో కూడా పదవీకాలం ముగిసిన తర్వాత అడ్ హాక్ కమిటీలద్వారానే పారదర్శకంగా ఎన్నికలకు వెళ్లిన చరిత్ర ఉంది. ఇప్పుడు కూడా అదే సంప్రదాయాన్ని పాటిస్తూ అడ్ హాక్ కమిటీ ఏర్పడితే, 'మమ్మల్ని అడగడానికి మీరు ఎవరు.?' అంటూ రాజారాం వర్గం ప్రశ్నించడం వారి అజ్ఞానానికి లేదా వారు చేసిన అక్రమాలు బయటపడతాయనే భయానికి నిదర్శనం అని కులస్థులు వ్యాఖ్యానిస్తున్నారు.

**మార్కండేయ మందిర నిర్మాణ చరిత్ర..**

గంగుల వంశస్థుల సేవలు.!ప్రస్తుత మార్కండేయ మందిరాన్ని గతంలో అడ్ హాక్ కమిటీ చైర్మన్ గంగుల సంతోష్ వంశస్థులు..కుల పెద్దలు ముందుండి నిర్మించిన ఘన చరిత్ర ఉంది. గంగుల సంతోష్ ఒక గెజిటెడ్ ఆఫీసర్‌గా తన వృత్తిపరమైన బాధ్యతల్లో నిత్యం ఊపిరి సలపకుండా ఉన్నప్పటికీ, కులంపై అభిమానంతో, పూర్వీకులు కట్టిన ఆలయాన్ని కాపాడుకోవాలనే తపనతో కుల సభ్యుల కోరిక మేరకు ముందుకు వచ్చారు. పాత ఆలయాన్ని కూల్చివేసే ముందు గంగుల వంశస్థులకు గానీ, దేవాలయ నిర్మానానికి భూమిని విరాళంగా ఇచ్చిన దాతలకు గానీ రాజారాం కనీస సమాచారం ఇవ్వలేదని ఆరోపణలు వచ్చాయి. కులస్తులందరి ఆత్మగౌరవ చిహ్నమైన ఆలయాన్ని తన సొంత ఆస్తిగా భావిస్తూ, 'అహం బ్రహ్మాస్మి' అన్న చందంగా రాజారాం వ్యవహరించడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

**దేవాలయాల పేరుతో 'బిజినెస్' ఆరోపణలు.. లెక్కలు గల్లంతు.**

రాజారాంకు దేవాలయాల నిర్మాణాలను ఒక 'బిజినెస్'గా మార్చుకోవడం పాత అలవాటేనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో త్రిశక్తి ఆలయాన్ని నిర్మించినట్లు చెప్పుకునే రాజారాం, దానికి సంబంధించిన ఒక్క రూపాయి ఖర్చు వివరాలను కూడా ఇప్పటికీ ఎవరికీ చూపలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే గతంలో అప్పటి ఎమ్మెల్యే స్వర్గీయ కొమిరెడ్డి రాములు ఇతన్ని అయ్యప్ప ఆలయ చైర్మన్‌గా నియమించినప్పుడు కూడా చందాల లెక్కలు గానీ, చందా బుక్కులు గానీ కమిటీకి అప్పగించకుండా తన వద్దే ఉంచుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎటువంటి స్పష్టమైన ఆదాయ మార్గాలు లేని రాజారాంకు ప్రస్తుతం ఉన్న ఆస్తులు ఎక్కడి నుండి వచ్చాయి.? ఏ పని చేస్తే ఈ సంపద కూడబెట్టారు.? గతంలో సైకిల్ టాక్సీ నిర్వహించిన ఇతనికి ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయి.? అనే అంశంపై పోలీస్ శాఖ..ఏసీబీ స్పందించి విచారణ జరపాలని కులస్థులు డిమాండ్ చేస్తుండడం పట్టణంలో కలకలం రేపుతోంది.

**రిజిస్ట్రేషన్-చందాల సేకరణలో అనుమానాలు.**

సంఘం రిజిస్ట్రేషన్ లేకుండా రాజారాం ఇంటి అడ్రస్‌తో దేవాలయం పేరుతో ఒక సంస్థను రిజిస్ట్రేషన్ చేయించినట్లు.. ఆ సంస్థ అడ్రెస్స్ కూడా తన ఇంటినే చూపినట్లు కుల సభ్యులు అనుమానిస్తున్నారు. ఆ సంస్థ పేరుమీదనే రశీదులు ముద్రించి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నాడని.. కనీసం అతను రిజిస్ట్రేషన్ చేసిన సంస్థ యొక్క రిజిస్ట్రేషన్ నెంబర్ కూడా చందా బుక్కులపై ముద్రించలేదని సంఘ సభ్యుల ఆరోపణ. వినాయక చవితికి చందాలు వసూలు చేసినట్లుగా చేయడంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పలువురు కోరుతున్నారు.

**భక్తుల సొమ్ముతో వడ్డీ దందా.?.. బ్యాంక్ ఖాతాల తనిఖీ డిమాండ్.**

భక్తుల సొమ్మును బినామీల వ్యక్తిగత ఖాతాల్లోకి మళ్లించిన వ్యవహారంపై బ్యాంక్ అకౌంట్లను తనిఖీ చేయాలంటున్నారు. దైవ కార్యానికి భక్తులు ఇచ్చిన చందాలను పక్కదారి పట్టించడమే కాకుండా, ఆ సొమ్ముతో మాజీ అధ్యక్షుడు ద్యావనపెల్లి రాజారాంతోపాటు..అతని అనుయాయుడు బేతు భాస్కర్ సాగిస్తున్న 'వడ్డీ దందాలు' ఇప్పుడు కుల సభ్యులను విస్తుపోయేలా చేస్తున్నాయంటున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం, కుల బాంధవుల నుండి వసూలు చేసిన లక్షలాది రూపాయల నిధులను సంఘం ఖాతాలో జమ చేయకుండా, రాజారాం.. అతని నమ్మకస్తుడు బేతు భాస్కర్ కలిసి పది రూపాయల భారీ వడ్డీకి బయటి వ్యక్తులకు అప్పులుగా ఇస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో వీరి ఇళ్లపై పోలీసులు రైడ్ చేసినట్లుగా కూడా తెలుస్తుంది. అట్టి రైడ్‌లలో కూడా ఎలాంటి వివరాలు దొరకకుండా జాగ్రత్త పడినట్లుగా..వారికి ఉన్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని తప్పించుకున్నారని పట్టణ ప్రజలు..కుల సంఘ సభ్యులు అనుకుంటున్నారు. భక్తుల సొమ్మును వడ్డీకి తిప్పుతూ, దాని ద్వారా వచ్చే లాభాలతో తమ వ్యక్తిగత ఆస్తులను భారీగా పెంచుకుంటున్నారని కులస్థులు మండిపడుతున్నారు.

**కులస్థుల ఆగ్రహం.. లెక్కలు బహిర్గతం చేయాలన్న డిమాండ్.**

గుడి కోసం ఇచ్చిన పైసా పైసాను తమ సొంత వ్యాపార పెట్టుబడిగా మార్చుకోవడం పద్మశాలి కుల సభ్యుల నమ్మకాన్ని వెన్నుపోటు పొడవడమేనని మేధావులు అభిప్రాయపడుతున్నారు.'న్యాయవాదుల సలహాలతో తప్పించుకోవచ్చని అనుకుంటే అది అతని భ్రమ.. చట్టం తన పంజా విసిరితే ఆస్తుల జప్తుతో పాటు జైలు ఊచలు లెక్కపెట్టక తప్పద'ని అడ్ హాక్ కమిటీ చైర్మన్ గంగుల సంతోష్ హెచ్చరించారు. అలాగే ఇతని అవినీతిపై విచారణ జరిపిస్తామని, ఇప్పటికైనా రాజారాం మొండివైఖరి వీడి, కులస్థుల ముందు బహిరంగంగా లెక్కలు అప్పగించాలని గంగుల సంతోష్'తోపాటు పద్మశాలి కుల బాంధవులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వివాదం చిలికి చిలికి గాలి వానలా మారుతోందంటున్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి





**డిఎస్పీ భార్గవి సూచనలు**

**నేటి సాక్షి :** ఎమ్మిగనూరు శ్రీ మహాయోగి లక్ష్మమ్మ డిగ్రీ కాలేజ్ వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మిగనూరు సబ్ డివిజన్ డిఎస్పీ భార్గవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితుల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లను నమ్మవద్దని, వ్యక్తిగత వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. మొబైల్, సోషల్ మీడియాను అవసరమైనప్పుడు మాత్రమే వినియోగించి చదువుపై దృష్టి పెట్టాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. మహిళా విద్యార్థినిలను ఉద్దేశించి భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ధైర్యంగా చదువుకుని తమ లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. స్వీయ రక్షణపై అవగాహన కలిగి ఉండడం అవసరమని తెలిపారు. అపరిచితులతో పరిచయాల్లో జాగ్రత్తగా ఉండాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. చదువుతో పాటు మంచి ప్రవర్తన అలవర్చుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని డిఎస్పీ భార్గవి విద్యార్థులకు పిలుపునిచ్చారు.

## కేసరి హనుమాన్ ఆలయంలో వార్షికోత్సవాలు

**నేటి సాక్షి గజ్వేల్ :** గజ్వేల్ పట్టణ శివారులోని కేసరి హనుమాన్ ఆలయంలో జరుగుతున్న వార్షికోత్సవాలు భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ ప్రాంగణం వేదమంత్రాల మంత్రోచ్చారణలతో మారుమోగుతూ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం స్వయంభూ ఆంజనేయస్వామికి అష్టోత్తర శత కలశాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పవిత్ర జలాలతో స్వామివారికి అభిషేకం చేయగా ఆలయమంతా దివ్యత్వంతో నిండిపోయింది. ఈ మహోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం లక్ష్మీనారాయణ స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవ సమయంలో మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు హర్షాతిరేకంతో పాల్గొని దేవదంపతులకు తలవంచి ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు నాయిని ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, జయసింహ, పిచ్చయ్యలతో పాటు హనుమాన్ దీక్షా స్వాములు, స్థానిక భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# కబడ్డీ టోర్నమెంట్‌లో ఎరిగేరి జట్టు ఘన విజయం






- ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి పాఠశాల బాలుర కబడ్డీ ఓపెన్ టటోర్నమెంట్

**నేటి సాక్షి:** కౌతాళం మండలం ఎరిగేరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచింది. గోస్పాదు మండలం సాంబవరం గ్రామంలో ఈస్టర్ పండుగ సందర్భంగా ఎస్బీఎం ఎంప్లాయిస్ టీం ఆధ్వర్యంలో ఈ పోటీలను ఘనంగా నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 58 జట్లు పాల్గొనడం పోటీలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లీగ్ దశల నుంచి ఫైనల్ వరకు ఎరిగేరి జట్టు ప్రతిభ కనబరిచి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తుదిపోరులో ధైర్యసాహసాలతో ఆడిన జట్టు ప్రత్యర్థిపై పైచేయి సాధించి మొదటి బహుమతిని కైవసం చేసుకుని ట్రోఫీని అందుకుంది. ఈ విజయంతో ఎరిగేరి గ్రామానికి మంచి గుర్తింపు రావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు. జట్టు విజయంలో ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు, ఫిజికల్ డైరెక్టర్ రాము అందించిన శిక్షణ, మార్గదర్శకత్వం కీలక పాత్ర పోషించింది.

# అంబరాన్నంటిన 'యువ దళపతి' జన్మదిన వేడుకలు



- సేవా కార్యక్రమాలతో హోరెత్తిన మహబూబాబాద్ జిల్లా.. ఘనంగా పాలాభిషేకాలు
- యువత, రైతు సంక్షేమమే ధ్యేయంగా నానావత్ భూపాల్ నాయక్ అడుగులు

**నేటి సాక్షి, మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా యువ పారిశ్రామిక వ్యాపారవేత్త, యువ దళపతి శ్రీ నానావత్ భూపాల్ నాయక్ జన్మదిన వేడుకలు అపూర్వ ఉత్సాహంతో, అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. జిల్లా నలుమూలల నుంచి ఆయన అభిమానులు, అనుచరులు, యువ దళపతి టీం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ వేడుకలను పండుగలా మార్చారు. ఈ కార్యక్రమం నర్సింహులపేట మండల కేంద్రంలో ప్రత్యేకంగా ఆకట్టుకుంది. భూపాల్ నాయక్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, అనంతరం మంగళ హారతులు సమర్పించి గౌరవం తెలిపారు. ఈ సందర్భంగా ప్రాంతం మొత్తం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. డప్పులు, జైకొట్టే నినాదాలతో కార్యక్రమం సందడిగా సాగింది. ఈ వేడుకల్లో భాగంగా మండల కోఆర్డినేటర్ చెలిమల్ల గణేష్ మాట్లాడుతూ, యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో చిన్న, మధ్య తరహా పరిశ్రమలను అభివృద్ధి చేస్తే ఉపాధి అవకాశాలు విస్తృతంగా పెరుగుతాయని అన్నారు. యువతలో ఆత్మవిశ్వాసం పెంచి, వారిని అభివృద్ధి దిశగా నడిపించడంలో భూపాల్ నాయక్ పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అలాగే భూపాల్ నాయక్ రైతుల సంక్షేమం కోసం, యువత అభ్యున్నతి కోసం ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నారని కొనియాడారు. జన్మదిన వేడుకలలో భాగంగా కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ చేసి, వారి విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించారు. పేదలకు అన్నదానం నిర్వహించి, పండ్లు పంపిణీ చేసి మానవతా విలువలను చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భూపాల్ నాయక్ గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆరోగ్యంగా ఉండి, మరిన్ని విజయాలు సాధించి, సమాజానికి ఇంకా గొప్ప సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# కో-ఆప్షన్ సభ్యుడిగా యూసుఫ్ అలీ ఖాన్ నామినేషన్



- మున్సిపల్ కార్యాలయంలో పత్రాల అందజేత.. మద్దతు తెలిపిన అభిమానులు
- పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని వెల్లడి

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుల నియామకానికి సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న నేపథ్యంలో, పట్టణానికి చెందిన మొహమ్మద్ యూసుఫ్ అలీ ఖాన్ బుధవారం తన నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు. పట్టణంలో సీనియర్ పాత్రికేయునిగా, సామాజికంగా చురుకైన వ్యక్తిగా గుర్తింపు పొందిన ఆయన అభ్యర్థిత్వం ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. యూసుఫ్ అలీ ఖాన్ విద్యావంతుడు, సామాజిక సమస్యలపై లోతైన అవగాహన కలిగిన వ్యక్తిగా పట్టణంలో మంచి పేరు సంపాదించుకున్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో ఉన్న సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండటం, ప్రజలతో నిరంతరం మమేకమై వారి ఇబ్బందులను తెలుసుకోవడం ఆయన ప్రత్యేకతగా స్థానికులు పేర్కొంటున్నారు. మున్సిపల్ అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని యూసుఫ్ అలీ ఖాన్ ఈ సందర్భంగా తెలిపారు. తనకు అవకాశం కల్పిస్తే కోరుట్ల పట్టణ సర్వతోముఖాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల నిర్మాణం, తాగునీరు మరియు పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇస్తానని స్పష్టం చేశారు. యూసుఫ్ అలీ ఖాన్ అభ్యర్థిత్వానికి స్థానిక ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తోంది. అనుభవం, ప్రజాసేవాభావం కలిగిన వ్యక్తి కో-ఆప్షన్ మెంబర్‌గా ఎన్నిక కావడం పట్టణానికి ఎంతో అవసరమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో ఆయన వెంట ముసావిర్, ఖిజర్, షాహిద్ సహా పలువురు ప్రముఖులు, మద్దతుదారులు పాల్గొన్నారు.

# రెయిన్‌బో కిడ్స్ స్కూల్‌లో 'మార్కెట్ డే' సందడి






- ఘనంగా ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు సూర్యమోహన్ రెడ్డి, సర్పంచ్ చెన్నయ్య
- చిన్నారుల 'మాక్ అసెంబ్లీ' ప్రదర్శన అమోఘం.. మురిసిపోయిన తల్లిదండ్రులు

**నేటి సాక్షి,మరికల్ :** నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని వైఎస్ ఫంక్షన్ హాల్‌లో రెయిన్‌బో కిడ్స్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన "మార్కెట్ డే అండర్ 18 మాక్ అసెంబ్లీ" కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ జిల్లా నాయకులు ఎస్.సూర్యమోహన్ రెడ్డి, స్థానిక సర్పంచ్ గుప చెన్నయ్య విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లారు. సేవా దృక్పథం ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ఎస్. సూర్యమోహన్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించింది. విద్యార్థుల్లో చిన్నతనం నుంచే సామాజిక అంశాలు, చట్టసభల పనితీరుపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి మాక్ అసెంబ్లీ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అతిథులు కొనియాడారు. మార్కెట్ డే ద్వారా పిల్లలకు క్రయవిక్రయాల పట్ల అవగాహన కల్పించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బెల్లగొంది వీరన్న, పట్టణ అధ్యక్షుడు హరీష్ కుమార్, మండల యూత్ అధ్యక్షుడు కాటేకొండ ఆంజనేయులు పాల్గొన్నారు. వీరితో పాటు 10వ వార్డు సభ్యులు పోలేమోని అశోక్, 1వ వార్డు సభ్యులు పెంటమీది రాజేశ్వరి రఘు, సీనియర్ నాయకులు పోలేమోని రామకృష్ణ, వెరీరామకృష్ణారెడ్డి, ట్రైసన్ జంగిడి రవి, అంజప్ప, శేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల ప్రదర్శనలను చూసి తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# అంగన్వాడీ టీచర్లకు సెల్ ఫోన్లు

## చిన్నారులకు యూనిఫామ్ పంపిణీ చేసిన, ఎమ్మెల్యే బిఎల్ఆర్



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి చేతులమీదుగా అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించే కార్యక్రమాలకు లబ్ధిదారులైన గర్భిణీలు, బాలింతలు, 6నెలల నుండి 3సంవత్సరాల చిన్నారులకు సంబంధించిన ప్రతి డాటాను ఎన్ హెచ్ టిఎస్ మరియు పోషణ ట్రాకర్ యాప్ లలో పొందపరచుట కొరకు మరియు తదుపరి ప్రాజెక్ట్ పరిధిలో గల 211 అంగన్వాడీ కేంద్రంలోని అంగన్వాడీ చిన్నారులకు యూనిఫామ్ డ్రెస్ లను అందజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో అర్బన్ సిడిపిఓ రేఖల మమత సూపర్వైజర్స్, పరిధిలోగల అంగన్వాడీ టీచర్స్ మరియు అర్బన్ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ నేషనల్ అవార్డు గ్రహీత

## సుంచు మల్లేశంకు ఘన సన్మానం



**నేటి సాక్షి,ధర్మారం :** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన 'తెలంగాణ వాణి' రిపోర్టర్ సుంచు మల్లేశంకు బుధవారం ఘన సన్మానం జరిగింది. ఇటీవల ఆయన అందుకున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డును పురస్కరించుకుని, ధర్మారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బంజేరుపల్లి తండా ఆల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు నున్సావత్ మోతిలాల్ నాయక్ ఆధ్వర్యంలో మల్లేశంను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మోతిలాల్ నాయక్ మాట్లాడుతూ.. మల్లేశం సమాజానికి అందిస్తున్న సేవలు అభినందనీయమని, భవిష్యత్తులో ఆయన మరిన్ని జాతీయ స్థాయి పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు అజ్మీర బాలునాయక్, ఇస్లావత్ శ్రీనివాస్ నాయక్, అజ్మీర రమేష్ నాయక్, నున్సావత్ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు

## అభిమాని వినూత్న చాటుకున్న నరేష్




**నేటి సాక్షి చౌడేపల్లి:** అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండలం పెద్దకొండమర్రి గ్రామంలో 'స్టైలిష్ స్టార్' అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు అత్యంత ఉత్సాహంగా జరిగాయి. గ్రామానికి చెందిన నరేష్ అనే యువకుడు తన అభిమాన నటుడి పుట్టినరోజును పురస్కరించుకుని చేసిన ఏర్పాట్లు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న నరేష్, అల్లు అర్జున్‌పై ఉన్న మక్కువతో ప్రతి ఏటా ఈ వేడుకలను నిర్వహిస్తున్నాడు. ఇందులో భాగంగా గ్రామంలో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి గ్రామస్థులకు పంచిపెట్టాడు. ముఖ్యంగా తన సొంత కష్టంతో నిర్మించుకున్న ఇంటి పైభాగంలో అల్లు అర్జున్ సిగ్నేచర్ గుర్తును ప్రతిష్టించడం విశేషం. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ, గత ఏడెనిమిది ఏళ్లుగా తన అభిమాన హీరో జన్మదినాన్ని జరుపుకుంటున్నానని, అల్లు అర్జున్ అంటే తనకు ప్రాణమని తెలిపాడు. తన జీవితంలో ఒక్కసారైనా ఆయనను కలిసి ఫోటో దిగాలన్నదే తన ఏకైక కోరికని ఆకాంక్ష వ్యక్తం చేశాడు. మారుమూల గ్రామంలో ఉన్న తనలాంటి సామాన్య అభిమానులను కూడా హీరో గుర్తించాలని నరేష్ కోరాడు. నరేష్ చూపిస్తున్న ఈ అసాధారణ అభిమానాన్ని గ్రామస్థులు ప్రశంసించడమే కాకుండా, వేడుకల్లో పాల్గొని సందడి చేశారు.



# పాలక్, ముకేశ్‌కు స్వర్ణం

## ఐఎస్ఎస్ఎఫ్ రైఫిల్ అండ్ పిస్టోల్ వరల్డ్ కప్‌లో భారత్ బోణీ

**గ్రానాడ (స్పెయిన్) :** ఐఎస్ఎస్ఎఫ్ రైఫిల్ అండ్ పిస్టోల్ వరల్డ్ కప్‌లో భారత్ తొలిరోజే శుభారంభం చేసింది. 10 మీటర్ల ఎయిర్‌పిస్టోల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత యువ షూటర్లు పాలక్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముకేశ్ పసిడి గురిపెట్టారు. ఫైనల్‌లో భారత ద్వయం 487.7 పాయింట్లు స్కోరు చేసి స్వర్ణం గెలుచుకోగా చైనా (484.8)కు రజతం, హంగేరి (414.9) కాంస్యం దక్కించుకున్నాయి. క్వాలిఫికేషన్ రౌండ్‌లో చైనా ద్వయం క్వియాంజు యావొ, కై హు (586)తో పోటీపడి 581 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన భారత జోడీ.. ఫైనల్‌లో మాత్రం సత్తాచాటింది. పాలక్, ముకేశ్ ప్రదర్శన జూనియర్ స్థాయిలో రికార్డు కావడం గమనార్హం.




# ఫైనల్‌కు మీనాక్షి, జైస్మీన్..

## పురుషుల విభాగంలో మరో ఇద్దరు

**ఉలన్‌బాతర్ (మంగోలియా) :** భారత యువ బాక్సర్లు మీనాక్షి హుడా, జైస్మీన్ లంబొరియా ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. మంగళవారం ఇక్కడ జరిగిన సెమీస్ బౌట్‌లలో ఈ ఇద్దరూ జోరును కొనసాగిస్తూ ప్రత్యర్థులను చిత్తు చేసి పసిడి పోరుకు అర్హత సాధించగా మెన్స్ క్యాటగిరీలోనూ విశ్వనాథ్ సురేశ్, సచిన్ సివాచ్ కూడా ఫైనల్ చేరారు. మహిళల 48 కిలలో సెమీస్‌లో మీనాక్షి.. 4-1తో తిప్సచ యొద్వరీ (థాయ్‌లాండ్)ని ఓడించగా జైస్మీన్ (57 కి.) 3-2తో నిగిన ఉక్తమొవ (ఉజ్బెకిస్థాన్)పై పోరాడి గెలిచింది. పురుషుల 60 కి. సెమీస్‌లో సచిన్.. 4-1తో సక్ద రౌమ్తమ్ (థాయ్‌లాండ్)ను చిత్తు చేయగా విశ్వనాథ్ (50 కి.) వరల్డ్ చాంపియన్, ప్రపంచ మొదటి ర్యాంకర్ అయిన కజకిస్థాన్ బాక్సర్ తష్కెంబెపై 5-0తో ఏకపక్ష విజయాన్ని నమోదుచేశాడు. తాజా ప్రదర్శనలతో ఈ టోర్నీలో ఫైనల్ చేరిన బాక్సర్ల సంఖ్య 8 (ఆరుగురు మహిళలు, ఇద్దరు పురుషులు)కు చేరింది. ఇదిలాఉండగా ఆకాశ్ (75 కి.), లోకేశ్ (85 కి.), నరేందర్ (90ం కి.), హర్ష్ చౌదరి (90 కి.) సెమీస్ బౌట్‌లలో ఓడి కాంస్య పతకంతో సంతృప్తి పడ్డారు.

# స్మృతి మంధాన పెళ్లిపై కొత్త ట్విస్ట్..



**ముంబై:** నవంబర్ 2025లో వైభవంగా జరగాల్సిన స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ వివాహం అనుకోని కారణాల వల్ల ఆగిపోయిన సంగతి తెలిసిందే. అయితే, తాజాగా వైరలవుతోన్న వీడియో చూస్తే మాత్రం అంతా షాక్ అవ్వాల్సిందే. ఎందుకంటే, ఈ వీడియో ఇరు కుటుంబాలు కలిసి ఉండడం, ఆప్యాయంగా మాట్లాడుకోవడం చూస్తే గొడవలు సద్దుమణిగాయని, త్వరలో గుడ్ న్యూస్ చెప్పనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. భారత మహిళా క్రికెట్ స్టార్ స్మృతి మంధాన, సంగీత దర్శకుడు పలాష్ ముచ్చల్ గతంలో పెళ్లి ఆగిపోవడంతో విడిపోయారనుకున్న ఈ జంట గురించి తాజాగా ఒక ఆసక్తికర వీడియో వెలుగులోకి వచ్చింది. రెండు కుటుంబాలు కలిసున్న ఈ దృశ్యాలు చూస్తుంటే వారి మధ్య విభేదాలు తొలగిపోయాయా అనే అనుమానాలు అభిమానుల్లో వ్యక్తమవుతున్నాయి. నిజానికి స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ వివాహం గత ఏడాది నవంబర్ (2025)లో వైభవంగా జరగాల్సింది. అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాక, సరిగ్గా పెళ్లికి ఒకరోజు ముందు స్మృతి తండ్రి శ్రీనివాస మంధాన ఆరోగ్యం క్షీణించడంతో వేడుకను వాయిదా వేశారు. అయితే ఆ తర్వాత పలాష్ మరొక అమ్మాయితో సన్నిహితంగా ఉంటూ దొరికిపోయారని, అందుకే స్మృతి ఈ పెళ్లిని రద్దు చేసుకుందనే వార్తలు నెట్టింట విపరీతంగా హల్చల్ చేశాయి. అప్పటి నుంచి వీరిద్దరూ కలిసి కనిపించకపోవడంతో బంధం తెగిపోయిందని అందరూ భావించారు.




# ఉత్కంఠ పోరులో గుజరాత్ టైటాన్స్ విజయం!

## ఆఖరి ఓవర్లో హైడ్రామా.. ఒక్క పరుగు తేడాతో ఢిల్లీ పరాజయం

**ఢిల్లీ, ఏప్రిల్ 8:** ఐపీఎల్ 14వ మ్యాచ్ క్రికెట్ అభిమానులకు అసలైన టీ 20 మజాను అందించింది. బుధవారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన ఈ హై స్కోరింగ్ మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. ఊపిరి బిగపట్టి చూసేలా సాగిన ఈ పోరులో గుజరాత్ టైటాన్స్ కేవలం 1 పరుగు తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఢిల్లీ బ్యాటర్ డేవిడ్ మిల్లర్ అద్భుతంగా ఆడి జట్టును విజయతీరాల దాకా చేర్చినా.. ఆఖరి ఓవర్లో ఆయన తీసుకున్న 1 తప్పుడు నిర్ణయం జట్టుకు ఘోర పరాజయాన్ని మిగిల్చింది.

### గుజరాత్ భారీ స్కోరు..

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు ఆరంభం నుంచే చెలరేగి ఆడారు. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ కేవలం 45 బంతుల్లోనే 70 పరుగులు చేసి శుభారంభం అందించాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన వాషింగ్టన్ సుందర్ 32 బంతుల్లో 55 పరుగులు, జోస్ బట్లర్ 27 బంతుల్లో 52 పరుగులు చేసి వీరబాదుడు బాదారు. దీంతో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 210 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఢిల్లీ బౌలర్లలో ముకేశ్ కుమార్ 2 వికెట్లు పడగొట్టగా.. లుంగి ఎన్గిడి, కుల్దీప్ యాదవ్ తలో 1 వికెట్ తీశారు.

### రాహుల్ ఒంటరి పోరాటం.. రషీద్ మ్యాజిక్ స్పెల్

211 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఓపెనర్ పాతుమ్ నిస్సాంక (24 బంతుల్లో 41), కేఎల్ రాహుల్ అద్భుతమైన పునాది వేశారు. ముఖ్యంగా కేఎల్ రాహుల్ గుజరాత్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 52 బంతుల్లోనే 92 పరుగులు చేసి సెంచరీకి తృటిలో మిస్సయ్యాడు. రాహుల్ అవుటైన తర్వాత మ్యాచ్ గుజరాత్ వైపు మొగ్గినట్లు కనిపించింది. గుజరాత్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ తన 4 ఓవర్లలో కేవలం 17 పరుగులు మాత్రమే ఇచ్చి 3 కీలక వికెట్లు తీసి ఢిల్లీ నడ్డి విరిచాడు. ప్రసిద్ధ్ కృష్ణ 2 వికెట్లు, మహ్మద్ సిరాజ్ 1 వికెట్ తీశారు.

### క్లైమాక్స్‌లో మిల్లర్ తప్పిదం..



మ్యాచ్ దాదాపు చేయిజారిపోతున్న దశలో క్రీజులోకి వచ్చిన డేవిడ్ మిల్లర్ అసాధారణ పోరాట పటిమ కనబరిచాడు. కేవలం 20 బంతుల్లోనే అజేయంగా 41 పరుగులు చేసి ఢిల్లీకి ఆశలు రేపాడు. మ్యాచ్ ఆఖరి ఓవర్ వరకు వెళ్లడంతో స్టేడియంలో ఉత్కంఠ తారాస్థాయికి చేరింది. ఆఖరి ఓవర్లో విజయానికి కొద్ది పరుగుల దూరంలో ఉన్న ఢిల్లీకి మిల్లర్ షాక్ ఇచ్చాడు. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్ 5వ బంతికి సింగిల్ తీసే అవకాశం స్పష్టంగా ఉన్నప్పటికీ.. మిల్లర్ పరుగు తీయడానికి నిరాకరించాడు. ఆఖరి బంతికి విన్నింగ్ షాట్ కొట్టి మ్యాచ్‌ను ముగించాలన్న అతివిశ్వాసంతో ఆ నిర్ణయం తీసుకున్నాడు. ఒకవేళ ఆ బంతికి సింగిల్ తీసి ఉంటే కనీసం స్కోర్లు సమం అయ్యేవి, మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీసేది. కానీ చివరి బంతికి గుజరాత్ బౌలర్ అద్భుతంగా బౌలింగ్ చేయడంతో ఆ బంతి డాట్ అయ్యింది. దీంతో ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 209 పరుగులకే పరిమితమైంది. కేవలం 1 పరుగు తేడాతో గుజరాత్ ఊహించని విజయం సాధించింది. ఒంటరి పోరాటంతో జట్టును గెలిపించే దాకా తెచ్చిన మిల్లర్.. చివరి నిమిషంలో చేసిన చిన్న తప్పు ఢిల్లీ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. చేతికందిన విజయాన్ని క్యాపిటల్స్ తృటిలో చేజార్చుకుంది.

**డేవిడ్ మిల్లర్ చేసిన ఆ ఒక్క తప్పే కొంపముంచిందా?**

**రాణించిన కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్**



# అప్పట్లోనే ఒకడు ఉండేవాడు

## 500 సిక్సర్లతో రోహిత్‌శర్మను మించిన హిట్‌మ్యాన్ ఇతను!

క్రికెట్ చరిత్రలో సిక్సర్ల వీరుల గురించి మాట్లాడితే మనకు వెంటనే క్రిస్ గేల్, రోహిత్ శర్మ లేదా షాహిద్ అఫ్రిది వంటి పేర్లు గుర్తొస్తాయి. కానీ, ఏ విధమైన హెల్మెట్లు, అత్యాధునిక బ్యాట్లు లేని కాలంలోనే సిక్సర్లతో స్టేడియాలను హోరెత్తించిన ఒక అరుదైన క్రికెటర్ ఉన్నారని మీకు తెలుసా. ఈ రోజుల్లో భారీ బ్యాట్లు, చిన్న బౌండరీల వల్ల సిక్సర్లు కొట్టడం సులభం అవుతుంది. కానీ 1930ల కాలంలోనే 500లకు పైగా సిక్సర్లు బాది చరిత్ర సృష్టించిన ఘనత ఆర్థర్ వెల్లార్డ్ సొంతం. ఆయన వేసిన ప్రతి బంతి ఒక బుల్లెట్ అయితే, ఆయన కొట్టిన ప్రతి సిక్సర్ ఒక సంచలనం. ఏప్రిల్ 8 ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఈ 'సిక్సర్ కింగ్' అద్భుతమైన రికార్డుల గురించి తెలుసుకుందాం.

### ఒక సీజన్‌లో 72 సిక్సర్లు..


ఆర్థర్ వెల్లార్డ్ 1935వ సంవత్సరంలో ఒకే సీజన్‌లో ఏకంగా 72 సిక్సర్లు కొట్టి అప్పట్లోనే ప్రపంచ రికార్డు సృష్టించారు. ఈ రికార్డు దాదాపు 50 ఏళ్ల పాటు చెక్కుచెదరకుండా ఉండిపోయింది. 1985లో ఇయాన్ బోథమ్ 80 సిక్సర్లు కొట్టే వరకు వెల్లార్డ్ పేరిటే ఈ రికార్డు ఉండేది. ఆర్థర్ వెల్లార్డ్ ప్రధానంగా ఫాస్ట్-మీడియం బౌలర్. ఇంగ్లాండ్ తరపున కేవలం రెండు టెస్టులే ఆడినప్పటికీ, ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఆయన ఒక లెజెండ్. 417 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో ఆయన 1,614 వికెట్లు పడగొట్టారు. ఇదే సమయంలో ఆయనలోని బ్యాటింగ్ విధ్వంసం చూసి ప్రపంచం ఆశ్చర్యపోయింది. ఈ స్టార్ తన మొత్తం కెరీర్‌లో 12,485 పరుగులు చేయగా, అందులో సుమారు 25 శాతం పరుగులు కేవలం సిక్సర్ల ద్వారానే రావడం విశేషం. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఆయన మొత్తం 500 కంటే ఎక్కువ సిక్సర్లు బాదారు. ఆ రోజుల్లో ఈ గణాంకాలు అంటే ఊహకందనివి.

### ఒకే ఓవర్‌లో ఐదు సిక్సర్లు..

ప్రస్తుతం టీ20ల్లో ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్లు చూడటం అరుదుగా జరుగుతుంటుంది. కానీ వెల్లార్డ్ 1930 ల్లోనే రెండుసార్లు ఒకే ఓవర్‌లో 5 సిక్సర్లు బాది చరిత్రాత్మక రికార్డు నెలకొల్పారు. ఒకసారి డెర్బీషైర్‌పై, మరోసారి కెంట్ జట్టుపై ఆయన ఈ ఫీట్ సాధించారు. గ్యారీ సోబర్స్ 6 సిక్సర్లు కొట్టే వరకు వెల్లార్డ్ రికార్డే అగ్రస్థానంలో ఉండేది. భారీ సిక్సర్లకు మారుపేరైన వెల్లార్డ్, క్రికెట్ ప్రపంచంలో మొట్టమొదటి పవర్ హిట్టర్‌గా నిలిచిపోయారు. నేడు హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ లాంటి వారు సిక్సర్ల రికార్డులను తిరగరాస్తున్న తరుణంలో, అసలు సిక్సర్ల మ్యాజిక్ ప్రారంభించిన ఆర్థర్ వెల్లార్డ్ చరిత్రను గుర్తు చేసుకోవడం ప్రతి క్రికెట్ అభిమానికీ స్ఫూర్తిదాయకం.



# అల్లు అర్జున్ రాకా!




## టైటిల్ రిలీజ్ చేసిన చిత్ర బృందం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే గిఫ్ట్ అందింది. తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో బన్నీ చేయబోతున్న భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి 'రాకా' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. విడుదలైన పోస్టర్‌లో అల్లు అర్జున్ మునుపెన్నడూ చూడని విభిన్నమైన అవతారంలో కనిపిస్తున్నారు. గుండుతో, కళ్లకు కాటుక పెట్టుకుని, ఒంటిపై వింత ఆకృతులతో ఉన్న ఈ లుక్ చూస్తుంటే ఆయన ఏదో 'వేర్-బీస్ట్' (జంతువుగా మారే మనిషి) తరహా పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. 'జవాన్' వంటి సెన్సేషనల్ హిట్ తర్వాత అట్లీ తెరకెక్కిస్తున్న చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇందులో బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తుండటం విశేషం. ఆమె ఈ చిత్రంలో ఒక వీరనారి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం సుమారు 800 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో, అత్యాధునిక ÷ఎఈచీ హంగులతో రూపొందుతోంది. హాలీవుడ్ టెక్నీషియన్లు కూడా ఈ ప్రాజెక్ట్ కోసం పని చేస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళం సహా 7 భాషల్లో 2027 వేసవిలో విడుదల చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. 'విజన్ బియాండ్ లిమిట్స్' హద్దులు లేని ఊహ అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# దురంధర్-2 విజయంపై స్పందించని దీపిక

## విమర్శకులకు ఘాటు సమాధానం ఇచ్చి నటి

బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టిస్తోంది. అయితే, ఈ సినిమా విజయంపై రణ్‌వీర్ భార్య, నటి దీపికా పదుకొణె ఇప్పటివరకూ స్పందించకపోవడంపై విమర్శలు ఎదురయ్యాయి. తాజాగా ఈ ట్రోల్స్‌పై ఆమె తనశైలిలో సమాధానమిచ్చారు. ఒక ఇన్‌స్టా పేజ్‌లో 'దీపికా తన భర్త సినిమాను ఎందుకు చూడడం లేదు. దాని గురించి ఎందుకు మాట్లాడట్లేదు' అని పెట్టిన పోస్ట్‌పై ఆమె స్పందిస్తూ.. 'మీ అందరికంటే ముందే నేను ఆ సినిమాను చూశాను. ఈ విషయం మీకు తెలీదు. ఇప్పుడు చెప్పండి ఎవరు ఎవరిని విమర్శించాలి' అంటూ వ్యంగ్యంగా కౌంటర్ ఇచ్చారు. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టనంత మాత్రాన తన భర్తకు మద్దతు ఇవ్వడం లేదని అనుకోవడం సరికాదని ఆమె ఈ రిప్లైతో స్పష్టంచేశారు. ఆదిత్యధర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం భారతీయ సినిమా చరిత్రలో రూ.1000 కోట్ల మార్క్‌ను దాటిన తొలి బాలీవుడ్ చిత్రంగా సరికొత్త చరిత్ర సృష్టించింది. రణ్‌వీర్‌తో పాటు ఆర్.మాధవన్, అక్షయ్‌ఖన్నా వంటి స్టార్స్ నటించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది.

# ఎన్టీఆర్, నీల్ మూవీ షూటింగ్ రద్దు ర్యూమర్స్

## వదంతులను తోసిపుచ్చిన చిత్ర బృదం



ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న సంగతి తెలిసిందే. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా మ-ఌస్తాబవుతోంది. ఈ సినిమా షూటింగ్ రద్దు అయిందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఎన్టీఆర్ లుక్ విషయంలో గందరగోళం నెలకొన్న నేపథ్యంలో షూటింగ్ వాయిదా వేశారని టాక్ వినిపించింది. తాజాగా ఈ వార్తలపై నిర్మాణ సంస్థ క్లారిటీ ఇచ్చింది. 'సినిమాలో హీరో లుక్, దీని షెడ్యూల్ రద్దు అంటూ వస్తోన్న వార్తల్లో నిజం లేదు. ఈ సినిమా షూటింగ్ ప్లాన్ ప్రకారమే ముందుకుసాగుతోంది. ప్రస్తుతం ప్రిపరేషన్ గ్యాప్ తీసుకున్నారంతే. దయచేసి ఎవరూ ఈ ప్రాజెక్ట్‌పై రూమర్స్ సృష్టించొద్దు. అనధికారిక సమాచారాన్ని షేర్ చేయొద్దు. ఏమైనా మార్పులు ఉంటే మేమే తెలియజేస్తాం' అని పేర్కొన్నారు. 'దేవర' తర్వాత ఎన్టీఆర్... 'సలార్' తర్వాత ప్రశాంత్ నీల్ చేస్తోన్న చిత్రమిది. 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉంది. ఎన్టీఆర్ సరసన ఇందులో రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్‌కపూర్ కీలక పాత్రలో నటిస్తున్నారు.






# లవ్ ఇన్సూరెన్స్ ప్రీ రిలీజ్ ఈవెంట్ స్టేజ్‌పై నయన్ సర్‌ప్రైజ్

విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి జంటగా నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమా రూపొందింది. ఈ చిత్రాన్ని నయనతార తన బ్యానర్‌పై నిర్మించడం విశేషం. ఇటీవల ఈ సినిమా తమిళ ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ ఈవెంట్‌లో దర్శకుడు విఘ్నేష్ శివన్ మాట్లాడుతుండగా, అనూహ్యంగా నయనతార స్టేజిపైకి వచ్చి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆమె సడన్ ఎంట్రీతో అక్కడి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. తన భార్యను స్టేజిపై చూసిన విఘ్నేష్ భావోద్వేగానికి గురయ్యాడు. కళ్లలో నీళ్లు తెచ్చుకున్న ఆయనను నయనతార దగ్గరికి వెళ్లి కౌగలించుకొని ఓదార్చింది. ఈ సన్నివేశం అక్కడున్నవారినే కాదు, అందరిని కూడా కదిలించింది. నయనతార తన భర్తకు ఇచ్చిన భావోద్వేగ మద్దతు చూసి ఫ్యాన్స్ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. 'రియల్ లైఫ్‌లో నిజమైన భాగస్వామ్యం ఇదే' అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, కృతి శెట్టి జంటగా రూపొందిన చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఏప్రిల్ 10న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కాబోతోంది. ప్రమోషన్స్ లో భాగంగా ఓ పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్న విఘ్నేష్.. ధనుష్ గురించి మాట్లాడుతూ..'ధనుష్ సార్ అంటే నాకు చాలా ఇష్టం. ఆయన్ని ఎప్పుడూ గొప్పగానే చూస్తాను. జులై 28 ఆయన బర్త్ డే. అది మా మా నాన్న చనిపోయిన రోజు. దాని వల్ల ధనుష్ లో నేను నా తండ్రిని చూసుకున్నట్లు ఫీల్ అవుతాను. ఆయన మీద అంత ప్రేమ ఉంది' అని అన్నారు.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్న



**నేటి సాక్షి, జగిత్యాల, (పూరెళ్ల బాపు):** జగిత్యాల నియోజకవర్గం అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానని జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ విమర్శకులకు ఘాటుగా సమాధానం చెప్పారు. జగిత్యాల అర్బన్ మండలం మోతే గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు 15 లక్షలతో సీసీ రోడ్డు పనులకు బుధవారం జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. అలాగే గ్రామానికి చెందిన సిర్ర నర్మదా మోహన్ ల ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపి,కానుకగా చీరను ఎమ్మెల్యే వారికీ కానుకగా అందజేశారు. ఈ సశీదర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరే కాకుండా అదనంగా 1200 ఇళ్లు మంజూరయ్యాయని చెప్పారు. జగిత్యాల పట్టణములో 4520 డబల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తి చేసి మౌలిక సదుపాయాలు కల్పన చేయటం జరిగిందన్నారు. జగిత్యాలకు ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు 5 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నా, విమర్శలకు

- **జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్**

అభివృద్ధి పనులతో సమాధానం చెప్తామని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో పేదల ఇంటి కల సాకారం అయిందన్నారు.అర్హులు అందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామనీ ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం ద్వారా అదనపు నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ప్రభుత్వంలో మోతే గ్రామానికి దాదాపు కోటి రూపాయల నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి,ఎం పి ఓ వాసవి,జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి,సర్పంచ్ మహేష్ ,ఉప సర్పంచ్ చందు,సీనియర్ నాయకులు సురేందర్ రావు,మాజీ మార్కెట్ ఛైర్మెన్ కొలుగూరి దామోదర్ రావు,మాజీ సర్పంచ్ లు జంబర్తి శంకర్,రాజేశ్వర్ రెడ్డి,మాజీ ఎంపిటిసి రాజశేఖర్ రెడ్డి,సర్పంచ్ లు గంగాధర్ దమ్మమల్లారెడ్డి,మోహన్ రెడ్డి ,ఆయిల్నేని నరేందర్ రావు ,మాజీ మార్కెట్ ఛైర్మెన్ నక్కల రవీందర్ రెడ్డి, బాల ముకుందం, మల్లారెడ్డి ,వార్డు సభ్యులు,శ్రీరామ్ భిక్షపతి,మాజీ ఉప సర్పంచ్ వెంకటేశ్,బందసంజయ్, గంగారెడ్డి,గంగ మల్లయ్య,శేఖర్, పిట్ట గంగాధర్, తుమ్మ గంగాధర్, ఏ ఈ విజయ్,కార్యదర్శి ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు




**నేటి సాక్షి మంచిర్యాల:** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి పోలీస్, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, ఆర్.టి.సి., విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణపై రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని,ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల, నిబంధనల ఉల్లంఘున పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ ఎత్తు గల బీమ్‌లు, తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్లపై అదుపు తప్పిన, ఓవర్ లోడెడ్ వాహనాలు, పరిమితికి మించి వేగంగా వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ పోలీసు అధికారులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి చేయడంలో కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో రోడ్డు భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని, గ్రామీణ ప్రాంతాలలో అంతర్గత రహదారులలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని, రహదారులపై కేజ్ వీల్స్,

- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

ట్రాక్టర్ కేజ్ వీల్స్ వినియోగాన్ని నిలిపివేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జాగ్రత్త సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. కూరగాయల వ్యాపారులు రహదారులపై విక్రయాలు చేయకుండా ప్రత్యేక మార్కెట్ స్థలాన్ని గుర్తించి తగు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. రహదారులపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాట్లు చేయాలని, ప్రతి మండల, గ్రామాల పరిధిలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో పట్టుబడిన వారి లైసెన్సులు రద్దుచేయాలని, వారి వివరాలు, పరిమితికి మించి లోడింగ్ చేసి తనిఖీలలో పట్టుబడిన వాహనాల వివరాలను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. రహదారులపై సంచరించే పశువులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గోశాలకు తరలించాలని తెలిపారు. అంతర్గత రహదారులలో కల్వర్టుల దగ్గర సూచికలు ఏర్పాటు చేయాలని, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో కుక్కల బెడదను నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓవర్ లోడింగ్, మితిమీరిన వేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో హాట్ స్పాట్ లను గుర్తించడం జరిగిందని, నగర పరిధిలో వాహనాల వేగ నియంత్రణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రహదారి ప్రమాదాలు, మరణాలు తగ్గించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

# నకిలీ విత్తనాల నియంత్రణపై కఠిన చర్యలు



**నేటి సాక్షి,మంచిర్యాల:** నకిలీ విత్తనాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో డిసిపి ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్ ఎ. సి. పి.లు ప్రకాష్, కిరణ్ కుమార్, వెంకటేశ్వర్లు లతో కలిసి వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులతో నకిలీ పత్తి విత్తనాలను అరికట్టడంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నకిలీ పత్తి విత్తనాల వినియోగం వలన కలిగే నష్టాలను రైతులకు అవగాహన కల్పించడంతో పాటు నకిలీ పత్తి విత్తనాలను సరఫరా చేసే దళారులు, విక్రయదారులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి మండలానికి పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో టాస్క్ ఫోర్స్ టీంను ఏర్పాటు చేయడం జరుగుతుందని, వారు సమన్వయంతో నకిలీ విత్తనాల సరఫరా చేసే దళారులపై చర్యలు తీసుకోవడంతో పాటు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసేలా రైతులకు వివరించాలని తెలిపారు. గ్రామాలలో దళారులు ఎవరైనా విడిగా పత్తి విత్తనాలు విక్రయించినట్లయితే పోలీస్ సిబ్బందికి సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. నకిలీ, నిషేధిత పత్తి విత్తనాల వినియోగం కారణంగా పెరిగే కలుపు తొలగించేందుకు గ్లైపోసిట్ మందు పిచికారి చేయడంతో భూసారం దెబ్బతింటుందని, క్యాన్సర్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు.

- **బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్**

పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బంది విస్తృతస్థాయి తనిఖీలు నిర్వహించాలని, జిల్లా సరిహద్దు ప్రాంతాలలో చెక్ పోస్ట్ ల వద్ద తనిఖీలు చేపట్టాలని తెలిపారు. రైతులు ప్రభుత్వ అనుమతి గల విత్తనాలు మాత్రమే వినియోగించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు వేదికల వద్ద నకిలీ విత్తనాలు వాడకం వలన రైతులకు, పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించాలని తెలిపారు. లైసెన్సు లేని దుకాణాల ద్వారా విక్రయించే ఏ విత్తనమైన నకిలీ విత్తనంగానే పరిగణించబడుతుందని, రైతులు లైసెన్సు గల షాపుల ద్వారానే విత్తనాలు కొనుగోలు చేయాలని, సంబంధిత షాపుల వద్ద నుండి రసీదులు తీసుకోవాలని తెలిపారు. డిసిపి భాస్కర్ మాట్లాడుతూ గత సంవత్సరము జిల్లాలో 17 కేసులు నమోదు చేసి 54 మందిని అరెస్టు చేయడం జరిగిందని, సుమారుగా 14 క్వింటాళ్ల నకిలీ విత్తనాలను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. విత్తనం నాటే సమయానికి ముందే పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సమన్వయంతో కార్యాచరణ ప్రారంభించి నకిలీ విత్తనాలను అరికట్టడంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు.

# బస్టాండ్ పక్కన 'గ్యాస్' గుబులు.. అధికారులు స్పందించరా

- **జనసమ్మర్ధ ప్రాంతంలో సిలిండర్ల విక్రయాలు.. ప్రమాదకరంగా ఆటోల్లో నిల్వ**
- **ఏజెన్సీ స్థలాన్ని ఊరి బయటకు మార్చాలని మరికల్ ప్రజల డిమాండ్**

**నేటి సాక్షి,మరికల్:** నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న గ్యాస్ ఏజెన్సీ విక్రయ కేంద్రం ఇప్పుడు స్థానికులను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. జనసమ్మర్ధం ఎక్కువగా ఉండే బస్టాండ్ పక్కనే గ్యాస్ విక్రయాలు జరపడం, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంపై పట్టణ ప్రజలు, మండల వాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ పక్కన ఉన్న భారత్ గ్యాస్ ఏజెన్సీ వారు రోడ్డు పక్కనే ఆటోల్లో గ్యాస్ సిలిండర్లను ఉంచి విక్రయాలు కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిత్యం ప్రయాణికులు, వాహనాలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఇలా బహిరంగంగా ఆటోల్లో సిలిండర్లను ఉంచడం వల్ల ఏదైనా అపశ్రుతి జరిగితే భారీ ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే ప్రమాదం ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జనావాసాల మధ్య సాగుతున్న ఈ గ్యాస్ విక్రయాల కేంద్రంపై మండల అధికారులు వెంటనే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదకరంగా మారిన ఈ ఏజెన్సీ స్థలాన్ని తక్షణమే అక్కడ నుంచి ఊరి బయటకు తరలించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అవాంఛనీయ



సంఘటనలు జరగకముందే సంబంధిత శాఖ అధికారులు స్పందించి తనిఖీలు చేపట్టాలని మరికల్ మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## జగజ్జీవన్ రామ్ భవనాన్ని నిర్మిస్తాం



**నేటి సాక్షి,చౌడేపల్లి:** మండల కేంద్రమైన చౌడేపల్లిలో బాబు జగజ్జీవన్ రామ్ భవనాన్ని నిర్మించి తీరుతామని మాదిగ దళ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపల్లి శేఖర స్పష్టం చేశారు. బుధవారం అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆయన చౌడేపల్లి గంగా జాతరకు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం స్థానిక బీసీ కాలనీలో మాదిగ సంక్షేమ సొసైటీకి, బాబు జగజ్జీవన్ రామ్ భవనానికి కేటాయించిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శేఖర మాట్లాడుతూ.. భవన నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరు కోసం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సానుకూల నిర్ణయం తీసుకువచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ నాయకులు, అధ్యక్షులు వెంకటరమణ, ఉపాధ్యక్షులు బాజిగం హరిబాబు, సదుం రామచంద్ర, రొంపిచర్ల హరి, అందాలపల్లి అంజప్ప, మల్లూరి హరిబాబు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## గంగ జాతరలో అన్నదానం



**నేటి సాక్షి,చౌడేపల్లి :** చౌడేపల్లి గంగ జాతరను పురస్కరించుకుని పట్టణానికి చెందిన భోజనాల రెడ్డి ప్రసాద్ ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరం భక్తుల ఆకలి తీరుస్తోంది. బుధవారం ఈ అన్నదాన శిబిరాన్ని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు మాదిరాజు ప్రదీప్ రాజు, లక్ష్మీపతి రాజులు కలిసి ప్రారంభించారు. ప్రతి ఏటా జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం భోజనాల రెడ్డి ప్రసాద్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. సేవా దృక్పథంతో ముందుకు వస్తున్న రెడ్డి ప్రసాద్‌ను అభినందించారు. యువత ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని సమాజ హితం కోరాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పాత్రికేయుల సంక్షేమంపై ప్రభుత్వం స్పందించాలి



**నేటి సాక్షి, ఎండపల్లి :** పాత్రికేయుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి తక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను, ప్రభుత్వ విధానాలను నిరంతరం సమాజానికి చేరవేసే కీలక బాధ్యతను జర్నలిస్టులు నిర్వర్తిస్తున్నారని, అలాంటి వర్గాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం బాధాకరమని అన్నారు. జర్నలిస్టులకు తక్షణమే ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అలాగే సమగ్ర ఆరోగ్య భీమా పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం తగదని ఆయన విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పని చేస్తున్న పాత్రికేయులు తక్కువ వేతనాలతో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నారని, ప్రమాదాలు లేదా అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు భరోసా ఇచ్చే భీమా సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలతో పాటు, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించాలని, పెన్షన్ మరియు అత్యవసర సహాయ నిధులను ఏర్పాటు చేసి వారి జీవన భద్రతను పెంపొందించాలని వెంకటేష్ విజ్ఞప్తి చేశారు.

## శభాష్ పోలీస్

**బాలుడుని తండ్రికి అప్పగింత**




**నేటిసాక్షి:** జగదేవపూర్ మండలంలో హోలీక్రాస్ కాలేజీ, అలిరాజాపేట సమీపంలో ఒక బాలుడు తప్పిపోయి ఉండగా, అతడిని జగదేవపూర్ పోలీస్ వారు, స్టేషన్‌లో ఉంచారు. ఆ బాలుడు తన పేరు జీవన్, తన తండ్రి పేరు నవీన్ అని, తన తండ్రి మేస్త్రీ పని చేస్తాడని, తమ ఊరు ఒంగోలు అని తెలియజేశాడు. ఈ విషయాన్ని సోషల్ మీడియా మరియు వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రచారం చేయగా, సుమారు గంటలోపే ఈ సమాచారం అతని తండ్రికి చేరింది. అనంతరం అతని తండ్రి నవీన్ జగదేవపూర్ పోలీస్ స్టేషన్‌కు రాగ పోలీసు వారు తగిన ధృవీకరణ అనంతరం బాలుడిని అతని తండ్రికి అప్పగించారు. ఈ సందర్భంగా బాలుడి తండ్రి నవీన్, జగదేవపూర్ పోలీసు సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# నయీమ్ నగర్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు





- విద్యార్థుల ప్రతిభకు వేదికగా మారిన వేడుకలు
- ఉర్దూ మీడియం విద్యార్థులకు మెరుగైన వసతులపై హామీ

**నేటి సాక్షి కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలోని 23వ వార్డులోని ఏస్కోనిగుట్ట (నయీమ్ నగర్) మండల పరిషత్ ప్రాథమిక ఉర్దూ మీడియం పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 2011లో స్థాపించబడిన ఈ పాఠశాల 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్ షాహిద్ ఉల్ ఆహాద్, మండల విద్యాశాఖ అధికారి గంగుల నరేశం, 23వ వార్డు కౌన్సిలర్ పుప్పాల ఉమాదేవి ప్రభాకర్ హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. వారి సమక్షంలో పాఠశాల ప్రగతి, విద్యార్థుల ప్రతిభపై ప్రశంసలు వెల్లువెత్తాయి. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అతిథులు అభిప్రాయపడ్డారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, స్వాగతాలు, నాటికలు ప్రేక్షకులను అలరించాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ వాజిద్ ప్రగతి నివేదికను వివరించగా, హాజరైన ముఖ్య అతిథులు విద్యార్థులను అభినందించి, వారి ప్రతిభను కొనియాడారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగాలని, ఉర్దూ మీడియం విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు మున్సిపాలిటీ మరింత చర్యలు తీసుకుంటుందని చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు భూమయ్య,సిఆర్పీ మాన్విత, భాగ్య, డాక్టర్ రమ్య, అలీ, వివిధ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు అజమ్, యూసఫ్ అలీ, అజయ్, షేక్ ఫరూఖ్, నజముద్దీన్ జాహిద్, అబిద్, సఫిల్ అభిదిన్, సాదిక్ భాషా, షకీల్, అబిద్, ఇలియాస్, అశోక్, రవి ఉపాధ్యాయులు, విద్యార్థులు,వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అక్రమ నిర్మాణాలకు అడ్డాగా వట్టినాగులపల్లి

- 111 జీవో నిబంధనలు బేఖాతర్.. భారీ సెల్లార్ల నిర్మాణంపై అధికారుల మౌనం
- ప్రభుత్వ ఆదాయానికి గండి.. తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



**నేటి సాక్షిరాజేంద్రనగర్,గండిపేట:** రాజేంద్రనగర్ నియోజకవర్గం గండిపేట మండలం నార్సింగి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వట్టినాగులపల్లి గ్రామం అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. పర్యావరణ పరిరక్షణ కోసం అమలులో ఉన్న 111 జీవో నిబంధనలను తుంగలో తొక్కి, కొందరు యథేచ్ఛగా అక్రమ కట్టడాలను కొనసాగిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామ పరిధిలో సుమారు 800 గజాల విస్తీర్ణంలో ఎలాంటి అనుమతులు లేకుండా భారీ సెల్లార్ల నిర్మాణం జరుగుతున్నా, జీహెచ్ఎంసీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ నిర్మాణాలపై అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ, అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక ఉన్న మర్మమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల మౌనం అక్రమార్కులకు వరంగా మారిందని, తెలిసి తెలియనట్టు వ్యవహరిస్తున్న తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాల వల్ల అటు పర్యావరణానికి ముప్పు కలగడమే కాకుండా, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోందని మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, నిబంధనలు అతిక్రమించి కడుతున్న అక్రమ కట్టడాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, నిర్మాణాలను నిలిపివేయాలని వట్టినాగులపల్లి గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# యువతే దేశ భవిష్యత్‌కి బలమైన పునాది



- నాగార్జున కాలేజీలో G.20 అవగాహన కార్యక్రమం

**నేటిసాక్షి, నల్లగొండ :** పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో "స్టూడెంట్ G.20 సమ్మిట్ 2026" మరియు " వికసిత్ భారత్–2047" లక్ష్యాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ప్రాజెక్ట్ లీడర్ నితిన్ ఆధ్వర్యంలో సాయినాథ్, తరుణ్, జాస్మిన్, తేజస్విని, వరప్రసాద్, శంకర్ లు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, భారతదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో యువత పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. "వికసిత్ భారత్ 2047" లక్ష్యాలను సాధించాలంటే విద్య, ఆరోగ్యం, సాంకేతిక అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో సమగ్ర పురోగతి అవసరమని వివరించారు. అలాగే "స్టూడెంట్ G–20 సమ్మిట్" ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, అంతర్జాతీయ అవగాహన, సామాజిక బాధ్యత పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు వివిధ అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ కార్యక్రమాన్ని మరింత చైతన్యవంతం చేశారు. గ్లోబల్ అంశాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో సమర్థ నాయకులుగా ఎదగగలరని అభిప్రాయపడ్డారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా. ప్రొఫెసర్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ, ఇటువంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడమే కాకుండా, సమాజంపై బాధ్యతను పెంచుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వారందరినీ అభినందించారు. మొత్తంగా, ఈ కార్యక్రమం యువతలో జాతీయ అభివృద్ధి పట్ల చైతన్యాన్ని పెంచడంలో ఒక కీలక మైలురాయిగా నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగార్జున ప్రభుత్వ కళాశాల ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు మరియు G.20 స్టూడెంట్స్ తదితరులు పాల్గొన్నారు.



# సూర్య గ్లోబల్ స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**నేటి సాక్షి, జగిత్యాల(పూరెళ్ల బాపు):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని సూర్య గ్లోబల్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని తమ విద్యా ప్రయాణంలో ఒక ముఖ్యమైన దశను ఆనందంగా జరుపుకున్నారు. పాఠశాల ఆవరణ ఆనందోత్సాహాలతో కళకళలాడింది. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకుని వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ల ప్రదానోత్సవం ప్రత్యేకంగా నిలిచింది. విద్యార్థులను ఒక్కొక్కరిని వేదికపైకి ఆహ్వానించి, ప్రిన్సిపల్ మరియు డైరెక్టర్లు వారి చేతుల మీదుగా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా పిల్లలకు అభినందనలు తెలుపుతూ వారి భవిష్యత్తు విజయాల కోసం శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు గౌన్లు, టోపీలు ధరించి సర్టిఫికెట్లు స్వీకరించడం కార్యక్రమానికి మరింత ఆకర్షణను తెచ్చింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ శ్రీధర్ రావు మాట్లాడుతూ, విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు మంచి విలువలు, నైతికతలను అలవర్చుకోవడం ఎంతో ముఖ్యమని సూచించారు. పిల్లల అభివృద్ధికి తోడ్పడిన తల్లిదండ్రులకు ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్ రావు, హరిచరణ్ రావు, ప్రశాంత్ రావు, మౌనిక రావు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు తమ అంకితభావంతో విద్యార్థులను ఈ స్థాయికి తీసుకువచ్చారని కొనియాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



**నేటి సాక్షి,తిరుమలాయపాలెం(రుద్రరాజు):** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో మొక్కజొన్న కొనుగోలు సబ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత రైతులు డిమాండ్ చేశారు. బుధవారం పిండిప్రోలుతో పాటు పరిసర ప్రాంతాలైన పాపాయిగూడెం, ఏదుల చెరువు, బీచురాజుపల్లి తండా, బాలాజీ నగర్ తండా, రమణ తండా, బలరాం తండాకు చెందిన రైతులందరూ కలిసి పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణను కలిసి తమ సమస్యను వివరించారు. రైతుల విజ్ఞప్తిపై శివరామకృష్ణ సానుకూలంగా స్పందించారు. వెంటనే మంత్రి క్యాంప్ కార్యాలయం ఇన్చార్జ్ తంబూరు దయాకర్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి, ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జడల నగేష్, కాంగ్రెస్ మండల నాయకులు గుగ్గిళ్ళ అంబేద్కర్, పుసులూరి సురేష్, గుగులోత్ వీరన్న, షేక్ సైదా, ఇస్లావత్ రవి, జాల కిరణ్, చామకూరి సాయి పాల్గొన్నారు. అలాగే రైతులు గంధసిరి శ్రీను, మాలోత్ ఉపేందర్, బానోత్ శ్రీను, గుగులోతు వెంకన్న, వీరయ్య, ధారావత్ ఉపేందర్, పుల్లకాని రమేష్, వెంకటేశ్వర్లు, చెక్కల వీరన్న, అశోక్ తదితరులు పాల్గొని తమ మద్దతు తెలిపారు.

# రైతులకు ఊరటనివ్వండి

## నరసింహుల గూడెంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



**నేటి సాక్షి,మునగాల :** మునగాల మండల పరిధిలోని నరసింహులగూడెం గ్రామంలో మొక్కజొన్న సాగు చేసిన రైతులకు ఊరటనిచ్చేలా వెంటనే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్ ఇందిరా నరసయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆమె సూర్యాపేట కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్‌ను స్వయంగా కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో సుమారు 400 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారని, స్థానికంగా కొనుగోలు కేంద్రం లేకపోవడంతో పంటను దూర ప్రాంతాలకు తరలించలేక, మధ్యవర్తుల దోపిడీకి గురవుతూ రైతులు నష్టపోతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రవాణా ఖర్చులు భారం కావడంతో చిన్న, మధ్య తరగతి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ విన్నపంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఆయన, తక్షణమే సంబంధిత వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులతో చర్చించి రెండు మూడు రోజుల్లోనే కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నీటి కొరత ఉన్న సమయంలో వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు వైపు రైతులు మళ్లడం అభినందనీయమని కలెక్టర్ కొనియాడారు. రైతుల శ్రమకు తగిన ధర లభించేలా జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు కూడా పెద్ద ఎత్తున పాల్గొని తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వం త్వరగా స్పందించి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన కొప్పుల



**నేటి సాక్షి,ఎండపల్లి :** మండల పరిధిలోని రాజారాంపల్లి ఎస్.ఆర్ గార్డెన్‌లో బుధవారం నిర్వహించిన రామిల్ల విద్యాసాగర్ – స్వాతిల వివాహ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. వెల్గటూర్ మండలానికి చెందిన ఈ నూతన వధూవరులను ఆశీర్వదించేందుకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెళ్లి వేడుకకు విచ్చేసిన ఆయన నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారి దాంపత్య జీవితం నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. సాంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. మాజీ మంత్రి వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు రామిల్ల సనీల్, జూపాక కుమార్, మూగల సత్యం, దేవి నళిని కాంత్, పడిదం వెంకటేష్, చొప్పదండి సంతోష్, కొడురుపాక అనిల్, చొప్పదండి బుచ్చిలింగయ్య, దుర్గం కృష్ణ, అరెల్లి బాబారాజ్, సిగిరి ఆనంద్ తదితరులు పాల్గొని నూతన వధూవరులను దీవించారు.

## శ్రీ కృష్ణవేణి స్కూల్‌లో ఫేర్‌వెల్ డే



**నేటి సాక్షి ,జగిత్యాల (పూరెల్ల బాపు):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఫేర్‌వెల్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిదవ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ నిర్వహించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి మాట్లాడుతూ, విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను సాధించాలని, క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి, డైరెక్టర్ శేఖర్ రెడ్డి, ట్రస్మా నాయకులు శ్రీధర్ రావు, జగన్ మోహన్ రెడ్డి, తిరుపతి రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.


## భీమరాయ స్వామి రథోత్సవం



**నేటి సాక్షి:** పెద్దకడబూరు మండలం జాలవడి గ్రామంలో శ్రీ భీమరాయ స్వామి రథోత్సవం ఇవాళ అశేష భక్త జనసందోహం మధ్య ఘనంగా జరిగింది. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పూజారి నాగరాజు స్వామి, ధర్మకర్త విరూపాక్షి గౌడ్ ఆధ్వర్యంలో స్వామివారికి ఆకుపూజ, మంగళహారతి వంటి పూజలు చేశారు. అనంతరం స్వామివారిని రథంపై ప్రతిష్ఠించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి కూడా భారీగా భక్తులు తరలివచ్చారు. భక్తి నినాదాల మధ్య రథోత్సవం కన్నుల పండువగా సాగింది. గ్రామంలో ఎక్కడ చూసినా పండుగ వాతావరణం నెలకొంది.

## నూతన వధూవరులకు ఆశీస్సులు

**అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ, ఎమ్మెల్యే జయ నాగేశ్వర రెడ్డి**



**నేటి సాక్షి:** పెద్దకడబూరు మండలంలో నిర్వహించిన వివాహ వేడుకలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. మండలంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో తలారి అంజి కుమారుడి వివాహం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్దకడబూరు మండల అధ్యక్షులు గవి గట్టు మల్లికార్జున, జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయ నాగేశ్వర రెడ్డి హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ, వివాహ జీవితం సుఖశాంతులతో నిండాలని, భగవంతుని ఆశీస్సులతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో సీనియర్ నాయకులు బసలదొడ్డి మాజీ అధ్యక్షులు ఈరన్నతో పాటు కోడిగుడ్లు ఏసేపు, దశరథ రాముడు, పెద్దకడబూరు రామాంజనేయులు, మురవాణి చెన్నకేశవ, గంగులపాడు భాష తదితర గ్రామ నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## రహదారిపై పశువుల సంచారం

**రైతులకు అవగాహన**



**నేటి సాక్షి,మునగాల:** మునగాల మండల పరిధిలోని ముకుందాపురం గ్రామంలో జాతీయ రహదారి-65 వెంట పశువుల సంచారం వల్ల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పోలీసులు రైతులకు అవగాహన కల్పించారు. వేసవి కాలంలో పశువులు తరచూ రహదారులపైకి రావడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో, బుధవారం గ్రామంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. రాత్రివేళల్లో పశువులు హఠాత్తుగా రహదారులపైకి రావడం వల్ల వేగంగా వచ్చే వాహనదారులు తీవ్ర ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాల వల్ల పశువులు మృతి చెందడమే కాకుండా, ప్రయాణికులు కూడా ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. దీనిని నియంత్రించేందుకు రైతులు తమ పశువులను కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని, ముఖ్యంగా రాత్రి సమయాల్లో వాహనదారులకు పశువులు సులభంగా కనిపించేలా వాటి కొమ్ములకు రెడ్ స్టిక్కర్లు అతికించాలని సూచించారు. ఈ చిన్న జాగ్రత్తతో పెను ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. రహదారి భద్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పశువుల యజమానులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## పంట ఎండే..

**పశువులకు మేతగా మారే**



**నేటిసాక్షి,జగదేవపూర్ :** ఎండలు మండలం భూగర్భ జలాల్లో బోరుబావులు భూగర్భ జలాలు తగ్గిపోవడంతో వరి పంటలు ఎండు ముఖం పడుతున్నాయి జగదేవపూర్ మండలం వివిధ గ్రామాల్లో యాసంగి సీజన్లో రైతులు సుమారు 5వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. కాగా మండే ఎండలకు భూగర్భ జలాలు తగ్గడంతో బోరుబావిలో నీటి శాతం తగ్గిపోయింది. దీంతో ఆయా గ్రామాల్లో వరి పంటలు ఎండు దశకు చేరుకున్నాయి. తిగుల్ గ్రామానికి చెందిన ఓ రైతు వరి పంటకు నీరు అందకపోవడంతో వరి మొత్తం ఎండి పోయింది. ఎండిన వరి పంట పశువులకు మేతగా మారింది.

# గజ్వేల్‌లో తెలంగాణ జాగృతి శక్తి ప్రదర్శన







- **సుదర్శన్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన కవిత**
- **ఏప్రిల్ 25న తెలంగాణ రాజకీయాల్లో కొత్త దిశగా కీలక ప్రకటన: కవిత**

**నేటి సాక్షి గజ్వేల్ :** సిద్ధిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో బుధవారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పర్యటించారు. ముందుగా తన చిన్ననాటి స్నేహితురాలి కుమారుడి వివాహ వేడుకకు హాజరైన కవిత, అనంతరం తెలంగాణ జాగృతి స్టేట్ సోషల్ మీడియా సభ్యులు సుదర్శన్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించేందుకు నేరుగా వారి నివాసానికి చేరుకున్నారు.

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సుదర్శన్ గౌడ్ సతీమణి నందిని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న కవిత, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా నందిని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, జాగృతి కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కవిత నేరుగా ఇంటికి వచ్చి పరామర్శించడంతో స్థానికంగా కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. పరామర్శ అనంతరం మీడియాతో మాట్లాడిన కవిత రాష్ట్ర రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ప్రస్తుతం మారుతున్న రాజకీయ పరిస్థితులు, ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి నేపథ్యంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఒక కొత్త రాజకీయ శక్తిగా అవతరించబోతున్నామని పేర్కొన్నారు. తమ రాజకీయ ప్రయాణం కేవలం అధికారం కోసమే కాదని, సామాజిక తెలంగాణ లక్ష్యంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా తమ పార్టీ కార్యాచరణ రూపొందుతుందని తెలిపారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడటంతో పాటు, రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయడమే తమ ప్రధాన ఉద్దేశమని ఆమె వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 25న జరగబోయే కీలక ప్రకటన తెలంగాణ రాజకీయాల్లో కొత్త మలుపు కావొచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జాగృతి నాయకులు, సుదర్శన్ గౌడ్ కుటుంబ సభ్యులు, గైనిబైటి నాగరాజు గౌడ్, బండ మహేందర్ గౌడ్, ప్యాటా అశోక్, కనకసేన తదితరులు, గజ్వేల్ జాగృతి సభ్యులు పాల్గొన్నారు.



# కలికోట సూరమ్మ చెరువు పనులపై 'విప్ ఆది' సమీక్ష

- **కథలాపూర్,మేడిపల్లి, భీమారం, రైతులకు కీలక ప్రాజెక్ట్**
- **వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేయాలని ఆదేశాలు**



**నేటి సాక్షి,కథలాపూర్ (రాధారపు నర్సయ్య):** వేములవాడ నియోజకవర్గం పరిధిలోని కథలాపూర్,మేడిపల్లి, భీమారం, మండలాల రైతులకు సాగు, త్రాగునీటి అవసరాలకు ఎంతో ఉపయోగపడే కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్ట్ పనులను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జిల్లా ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించి, పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సూరమ్మ చెరువు ప్రాజెక్ట్ పనుల ప్రగతిని స్థలంలోనే పరిశీలించిన అధికారులు, ప్రస్తుత పరిస్థితులపై వివరణలు అందించారు. పనుల నాణ్యత, వేగం, నిర్మాణ దశలపై సమగ్రంగా చర్చించడంతో పాటు, మిగిలిన పనులను వేగవంతం చేయాలని సూచనలు చేశారు. రైతులకు ఈ ప్రాజెక్ట్ ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. కలికోట సూరమ్మ చెరువు పూర్తయితే కథలాపూర్,మేడిపల్లి, భీమారం, మండలాల రైతులకు సాగునీటి కొరత తగ్గి, పంటల ఉత్పత్తి పెరుగుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సమస్య కూడా కొంతవరకు పరిష్కారం కానుంది.వచ్చే వర్షాకాలంలోపు ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్‌కు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో ఆలస్యం సహించబోమని హెచ్చరిస్తూ, సమయపాలనతో పాటు నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ఆయన వెంట కథలాపూర్ మండలం,భీమారం,మేడిపల్లి రైతులు,ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు ఖాయం



- **సీసీ రోడ్లకు రూ.5.41 కోట్లు, రైతు భరోసాకు రూ.9 వేల కోట్లు విడుదల చేసిన కాంగ్రెస్ సర్కార్ : అంక్షారెడ్డి**

**నేటి సాక్షి గజ్వేల్ :** గజ్వేల్ నియోజకవర్గ పరిధిలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట అంక్షారెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే రెండు విడతలుగా కాంగ్రెస్ ప్రభుత్వం గజ్వేల్ నియోజకవర్గానికి 7 వేల ఇందిరమ్మ ఇండ్లు కేటాయించినట్లు తెలిపారు. బుధవారం గజ్వేల్ మండలం బెజగాం గ్రామంలో సర్పంచ్ నకిర్తి గోపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పీసీసీ నాయకులు నాయిని యాదగిరి, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు అశోక్ రెడ్డితో కలిసి ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రేకుల ఇంటిలో నివసిస్తున్న లబ్ధిదారుడు నరహరి కుటుంబం ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేసుకొని గృహప్రవేశం చేయడం సంతోషకరమని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ గజ్వేల్ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. చారిత్రాత్మక నిర్ణయాలు సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్నారని, ఏకకాలంలో రూ.2 లక్షల పంట రుణమాఫీ చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. అలాగే రైతు భరోసా కింద రూ.9 వేల కోట్ల నిధులు విడుదల చేయడంతో ప్రతిపక్షాల విమర్శలకు చోటు లేకుండా పోయిందని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రతి పంటను కొనుగోలు చేస్తోందని, సన్నధాన్యానికి రూ.500 బోనస్ రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. యూరియా పక్కదారి పట్టకుండా అక్రమాలను అరికట్టేందుకే పంపిణీపై పటిష్ట చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. గ్రామాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని పార్టీలకు అతీతంగా సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.5 కోట్ల 41 లక్షలు మంజూరు చేసినట్లు అంక్షారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సుఖేందర్ రెడ్డి, సర్పంచులు వెంకట్ రెడ్డి, మల్లారెడ్డి, ప్రశాంత్, మైనార్టీ సెల్ జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సమీర్, నేతలు శివారెడ్డి, గుంటుకు శ్రీనివాస్, జంగం రమేష్ గౌడ్, గాడిపల్లి శ్రీనివాస్, మహమ్మద్ అజ్గర్, నక్క రాములు, జాకీర్, కొండల్ రెడ్డి, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





# 'నాలో ప్రాణం' ఉన్నంత వరకు నా కార్యకర్తలకు 'తోడూ-నీడై' ఉంటా.!

- కోరుట్ల కార్నర్ సభలో.. సురభి నవీన్ భావోద్వేగ ప్రసంగం
- రాష్ట్ర కార్యవర్గంలో రెండోసారి స్థానం పొందిన సురభి నవీన్ కుమార్
- మెట్‌పల్లి-కోరుట్ల పట్టణాల్లో కార్యకర్తల 'కాషాయ జోష్'
- మెట్‌పల్లి నుంచి కోరుట్ల వరకు వెయ్యి మందితో భారీ బైక్ ర్యాలీ
- నినాదాలతో మారుమోగిన జాతీయ రహదారి
- అడుగడుగునా జన నీరాజనం



**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా రెండవసారి ఎన్నికైన సురభి నవీన్ కుమార్‌కు కోరుట్ల నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. మెట్‌పల్లి అయ్యప్ప గుడి ముందరి నుంచి కోరుట్ల పట్టణంలోని ఆయన స్వగృహం వరకు సుమారు 1000 మంది కార్యకర్తలు భారీ స్థాయిలో బైక్ ర్యాలీ నిర్వహించి ఘనంగా స్వాగతం పలికారు. జాతీయ రహదారిపై ఆయనకు అడుగడుగునా జనం నీరాజనం పలికారు.



## మెట్‌పల్లి అయ్యప్ప గుడి నుంచి ప్రారంభమైన కాషాయ జోష్.!

మెట్‌పల్లి అయ్యప్ప గుడి ముందరి నుంచి ప్రారంభమైన ఈ భారీ ద్విచక్ర వాహన ర్యాలీ ఆరంభం నుంచే ఉత్సాహభరిత వాతావరణాన్ని సంతరించుకుంది. పార్టీ జెండాలు, బ్యానర్లు, నినాదాలతో కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. మెట్‌పల్లి నుండి ఆరపేట, మారుతి నగర్ మీదుగా జాతీయ రహదారిపై సాగిన ఈ బైక్ ర్యాలీ మొత్తం మార్గమంతా కాషాయ వర్ణంతో కళకళలాడింది. నవీన్ కుమార్‌కు స్వాగతం పలికేందుకు మార్గమధ్యంలో పలుచోట్ల స్థానికులు, వ్యాపారులు, యువత ముందుకు రావడం విశేషంగా నిలిచింది.

## ఆరపేట.. మారుతి నగర్.. నంది చౌరస్తా వద్ద నీరాజనం.!

బైక్ ర్యాలీ ఆరపేట, మారుతినగర్, నంది చౌరస్తా ప్రాంతాలకు చేరుకున్న సమయంలో అక్కడ ముందుగానే వేచి ఉన్న మహిళలు నవీన్ కుమార్‌కు హారతులు ఇచ్చి ఆశీస్సులు అందించారు. పూలతో, శుభాకాంక్షలతో ఆయనను ఆహ్వానించారు. మహిళల ఆదరణకు కృతజ్ఞతలు తెలుపుతూ నవీన్ కుమార్ వారికి నమస్కరించారు. వారి ఆదరణ తనకు మరింత బాధ్యతను కలిగించిందని పేర్కొన్నారు. అడుగడుగునా ప్రజలు నీరాజనం పలుకుతూ ఆయనను ఆహ్వానించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## నినాదాలతో మారుమోగిన జాతీయ రహదారి.!

జాతీయ రహదారిపై సాగిన ర్యాలీ సమయంలో 'బిజెపి జిందాబాద్'..'నవీనన్న నాయకత్వం వర్ధిల్లాలి..'అంటూ కార్యకర్తలు నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. మెట్‌పల్లి నుంచి కోరుట్ల వరకు ప్రతి కిలోమీటరు దూరంలో కార్యకర్తల సందడి కనిపించింది. ఈ ర్యాలీ కేవలం స్వాగత కార్యక్రమం మాత్రమే కాకుండా, పార్టీ పట్ల కార్యకర్తల నిబద్ధతను ప్రతిబింబించేలా సాగింది.

## భావోద్వేగ ప్రసంగం.. కార్యకర్తల్లో ఉప్పొంగిన ఉత్సాహం

కోరుట్ల బస్ స్టేషన్ ఔట్ గేట్ వద్ద కార్నర్ మీటింగ్‌లో కార్యకర్తలనుద్దేశించి ఉత్తేజితంగా సురభి నవీన్ కుమార్ మాట్లాడారు. బిజెపి అంటేనే కార్యకర్తల పార్టీ అని, కార్యకర్తలు లేకుంటే ఏ నాయకుడు లేడని పేర్కొన్నారు. ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా మీ కుటుంబ సభ్యులుగా మీతోడుంటానని, నా చివరి శ్వాస వరకు కాషాయాన్ని విడిచేది లేదని, ఎన్ని అడ్డంకులు సృష్టించిన ఎదురొడ్డి పోరాడుతానని తెలిపారు. తన కోసం నిరీక్షించిన జనాలనుద్దేశించి సురభి నవీన్ కుమార్ ఉత్తేజపరుస్తూ మాట్లాడారు. 'నాలో ప్రాణం ఉన్నంత వరకు బిజెపి లోనే ఉంటాను.. కార్యకర్తల కోసమే పనిచేస్తాను.. వారికి ఎల్లవేళలా తోడూ-నీడై కాపాడుకుంటానని..' భావోద్వేగంగా మాట్లాడి హోరెత్తించారు. ఆయన మాటలకు కార్యకర్తలు హర్షధ్వానాలతో స్పందించారు. ఆయన చిన్నపాటి ప్రసంగానికే కార్యకర్తలు, అనుచరుల హృదయం సంతోషంతో ఉప్పొంగిందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

## రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు.. ఘన సన్మానం.!

తనపై నమ్మకంతో తనకి రెండవసారి బాధ్యత ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావుకి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కి, సంఘ్ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వారి నివాసం వరకు బైక్ ర్యాలీగా బయలుదేరారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రెండవసారి బాధ్యతలు స్వీకరించినందుకు బిజెపి శ్రేణులు ఘనంగా సన్మానించారు.

## కార్యకర్తల ఐక్యత.. నాయకత్వంపై నమ్మకం.!

సుమారు వెయ్యి మంది కార్యకర్తలు స్వచ్ఛందంగా పాల్గొని నిర్వహించిన ఈ బైక్ ర్యాలీ, కోరుట్ల నియోజకవర్గంలో బిజెపి బలాన్ని, ఐక్యతను ప్రతిబింబించింది. రెండోసారి రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైన నవీన్ కుమార్ పట్ల కార్యకర్తల విశ్వాసం స్పష్టంగా కనిపించింది. భవిష్యత్తులో ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.













# ప్రాణాలతో ఇంటికి తిరిగి వస్తానని అనుకోలేదు!

## 47 ఏళ్ల అనంతరం సొంతూరు కోరుట్లకు మావోయిస్టు అగ్రనేత 'దేవ్ జీ' రాక

| | | |
|---|---|---|
| 1983లో ఉద్యమంలో చేరి కేంద్ర కమిటీ కార్యదర్శి స్థాయికి ఎదిగిన తిప్పిరి తిరుపతి | లొంగిపోయిన అనంతరం మొదటిసారి స్వగృహ ప్రవేశం.. భావోద్వేగ క్షణాలు | బంధుమిత్రుల మధ్య జ్ఞాపకాల వెల్లువ.. ప్రజాజీవితంలో కొనసాగుతానన్న 'దేవ్ జీ' |

Welcome Back

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)**


'ప్రాణాలతో తిరిగి వస్తానని ఎప్పుడూ అనుకోలేదు..' అనే ఒక్క వాక్యం వెనుక నాలుగు దశాబ్దాల అజ్ఞాతం, పోరాటం, త్యాగం, జ్ఞాపకాల భారమంతా దాగి ఉంది.! 1983లో ఉద్యమబాట పట్టి మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి స్థాయికి ఎదిగిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ, దాదాపు 47 ఏళ్ల తర్వాత అజ్ఞాతాన్ని వీడి సొంతూరు కోరుట్లకు చేరుకోవడం స్థానికంగా కాక దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఎన్ఐఏ మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్న ఆయన ఇటీవల సహచరులతో కలిసి లొంగిపోయి, ఇప్పుడు తన పుట్టిన ఊరి నేలపై అడుగుపెట్టడం భావోద్వేగ క్షణాలకు నాంది పలికింది..!"



## మళ్లీ వస్తానని కలలో కూడా అనుకోలేదు..

**- దేవ్ జీ వ్యాఖ్యలు.!**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దేవ్ జీ మాట్లాడుతూ.. తాను ఉద్యమబాటలో వెళ్లిన తర్వాత మళ్లీ సొంతింటికి వస్తానని కలలో కూడా అనుకోలేదని స్పష్టం చేశారు. 'ప్రాణాలతో బయటకు వస్తానని కూడా ఊహించలేద'ని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. జనజీవన స్రవంతిలో కలిసిన తర్వాత ఇదే మొదటిసారి సొంత ఊరికి రావడం జరిగిందన్నారు. తనను కలవడానికి వచ్చిన చిన్ననాటి మిత్రులు, బంధువులు తనకు ఎంతో ఆనందాన్ని కలిగించారని తెలిపారు. ఒక ప్రశ్నకు సమాధానంగా తాను చెప్పాల్సిన విషయాలను ఇప్పటికే గతంలో మీడియా సమావేశంలో వెల్లడించానని, ప్రస్తుతం కేవలం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను కలవడానికి మాత్రమే వచ్చానని పేర్కొన్నారు. మరోవైపు, దోపిడీ, పీడనలేని సమ సమాజ నిర్మాణం కోసం అప్పట్లో అజ్ఞాతంలోకి వెళ్లానని, ఆర్థిక, సామాజిక, కుల, మత అసమానతలు లేకుండా సమాజం ఉండాలని ఇప్పటికీ అదే భావన కొనసాగుతుందని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల కోసం పని చేస్తానని, వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సరికాదని భావిస్తున్నానన్నారు.



## ప్రజాజీవితంలో కొనసాగుతా..

**(భవిష్యత్ దిశపై సంకేతాలు!)**





మావోయిస్టుగా అజ్ఞాత జీవితం వదిలినప్పటికీ..తాను ఇకపై వ్యక్తిగత జీవితానికే పరిమితం కాకుండా ప్రజాజీవితంలో కొనసాగుతానని దేవ్ జీ స్పష్టం చేశారు. ప్రజలు ఎక్కడికి పిలిస్తే అక్కడికి వెళ్తానని, కోరుట్ల పట్టణమే తన ఇంటిలా భావిస్తున్నానని పేర్కొన్నారు. గురువారం మరింత మంది పట్టణ ప్రజలను కలిసే కార్యక్రమం ఉందని తెలిపారు. తనపై నమ్మకంతో, అనుబంధంతో ఉన్న వారందరినీ వ్యక్తిగతంగా కలుసుకోవడం తన ప్రధాన ఉద్దేశమన్నారు. ఇదిలా ఉండగా, అజ్ఞాతంలో ఉన్న సమయంలో సోషల్ మీడియా వేదికగా పోస్టులు చేసిన తన తమ్ముడి కూతురు తిప్పిరి సుమ గురించి కూడా స్పందిస్తూ..ఆమె అభిప్రాయాలు అజ్ఞాతంలో ఉన్న ప్రతి ఒక్కరి కుటుంబ సభ్యుల భావోద్వేగాల ప్రతిబింబంగానే భావించామని అన్నారు. తనతో పాటు సహచరుల గురించి కూడా ఆమె రాసిందని అనుకున్నామని వ్యాఖ్యానించారు. మొత్తంగా నాలుగు దశాబ్దాల వనవాసం అనంతరం సొంతూరికి చేరుకున్న దేవ్ జీ రాక కోరుట్లలో మాత్రమే కాదు, రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఆయన భవిష్యత్ అడుగులు ఎలా ఉంటాయన్నదానిపై అందరిలోనూ ఇప్పుడు ఆసక్తి నెలకొంది..!!



## స్వగృహ ప్రవేశం - భావోద్వేగాల వెల్లువ.!

జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ బుధవారం సాయంత్రం తన స్వగృహానికి చేరుకోవడం పట్టణంలో ఉద్వేగభరిత వాతావరణాన్ని సృష్టించింది.! హైదరాబాద్ కు వెళ్లిన ఆయన తమ్ముడు తిప్పిరి గంగాధర్‌తో పాటు కుటుంబ సభ్యులు ఆయనను రిసీవ్ చేసుకుని కోరుట్లకు తీసుకువచ్చారు. సుమారు 45-47 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత సొంతూరులో అడుగుపెట్టిన ఆయన రాకతో కోరుట్ల పట్టణమంతా భావోద్వేగంతో నిండిపోయింది. ఊరికి చేరుకున్న వెంటనే తన పుట్టి పెరిగిన ఇంటికి వెళ్లి స్వర్గస్తులైన తల్లిదండ్రుల ఫోటోలకు నివాళులు అర్పించడం అక్కడి వారిని కంటతడి పెట్టించింది. అనంతరం బంధుమిత్రులు, చిన్ననాటి స్నేహితులతో ఆప్యాయంగా కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆయనను చూసేందుకు పెద్ద ఎత్తున స్థానికులు తరలివచ్చి స్వాగతం పలికారు. చిన్ననాటి స్నేహితులు, బంధువులను చూసి దేవ్ జీ భావోద్వేగానికి లోనయ్యారు. తనతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ కలవడం తనకు అపూర్వ అనుభూతినిచ్చిందని తెలిపారు.